Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

మంగళవారం, జూలై 1, 2025



## అమల్లోకి వచ్చిన కొత్త రైల్వే ఛార్జీలు



హైదరాబాద్ : రైల్వే బోర్డు కీ లక నిర్ణయం తీసుకుంది. రైల్వే చార్జీల పెంపు, టికెట్ బుకింగ్‌లో నిబంధనల అమలుకు సం బంధించి ఆదేశాలు జారీ చేసింది. సోమవా రం అర్ధరాత్రి నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయని వెల్లడించింది. కొత్త చార్జీలతో పాటు, తత్కాల్ టికెట్ బుకింగ్ లో ఆధార్ త ప్పనిసరి చేశారు. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500 కిలోమీటర్ల వరకు సాధారణ చార్జీలే ఉండనున్నాయి. 501 కిలోమీటర్ల నుంచి 1500 కిలోమీటర్ల వరకు టికెట్‌పై రూ.5 పెంచారు. 1501 కి.మీ.నుంచి 2500 కి. మీల వరకు టి కెట్ పై రూ. 10, 2501 కి.మీల నుంచి 3 వేల కిలోమీటర్ల వరకు టికెట్ పై రూ. 15 పెం చా రు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కిలోమీటర్ కు అర పైసా, మెయిల్ లేదా ఎక్స్ ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ టికెట్లపై కిలోమీటర్ కు ఒక పైసా పెంచారు.



# ప్రాణాలు బుగ్గిపాలు

## ఫార్మా పరిశ్రమలో భారీ పేలుడు

## 20 మంది దుర్మరణం!

### 36మందికి కాలిన గాయాలు.. పలువురి పరిస్థితి విషమం

- కుప్పకూలిన భవనాలు.. శిథిలాల కింద మరికొందరు..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ కంపెనీలో రియాక్టర్ పేలడంతో ప్రమాదం
- చెల్లాచెదురుగా ఎగిరిపడిన కార్మికులు, ఛిద్రమైన శరీరాలు
- అగ్నికీలల్లో పలువురి సజీవదహనం..
- సమీప ఆసుపత్రులకు క్షతగాత్రుల తరలింపు
- మృతుల్లో ఎక్కువమంది ఒడిశా, బిహార్, యూపీ వారే..
- అర్ధరాత్రి వరకు కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్...
- ఘటనా స్థలాన్ని,ఆస్పత్రులను సందర్శించిన మంత్రులు.. నేడు సీఎం రాక
- ప్రధాని మోదీ, సీఎం రేవంత్ సహా ప్రముఖుల సంతాపం

సంగారెడ్డి : ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరున్న పాశమైలారంలోని సిగాచి అనే ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. కంపెనీలోని రియాక్టర్ పేలిపోగా దాని తీవ్రతకు మూడంతస్తుల భవనాలు రెండు కుప్పకూలిపోయాయి. పరిశ్రమ పైకప్పు, రేకులు, ఇతర యంత్ర భాగాలు ఎగిరి వంద మీటర్ల దూరంలో పడ్డాయి. యంత్రాల భాగాలు చెల్లాచెదురయ్యాయి. భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ ప్రదేశమంతా దట్టమైన పొగ అలుముకుంది. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న 100 మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పేలుడు ధాటికి చెల్లాచెదురుగా పడిపోయారు. శరీరాలు ఛిద్రమైపోయాయి. 10 మంది అక్కడికక్కడే సజీవ దహనం కాగా ఇద్దరు ఆస్పత్రుల్లో మృతి చెందినట్లు తెలుస్తోంది. మొత్తం 16 మంది మరణించినట్లు అనధికారిక సమాచారంకాగా, మంత్రులు దామోదర, వివేక్ మాత్రం 12 మంది మరణించినట్లు ప్రకటించారు. మృతదేహాలను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. సుమారు 36 మంది గాయపడ్డారు. 20 మందికి పైగా కార్మికులకు 80 శాతానికి పైగా కాలిన గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను సమీపంలో ఉన్న పటాన్‌చెరు, చందానగర్, మదీనాగూడ, మియాపూర్‌లలోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భవనాల శిథిలాల కింద మరింత మంది కార్మికులు, ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని

(మిగతా 2వ పేజీలో)

## రాంచందర్‌రావుకు పట్టం

- నేతలు, కార్యకర్తలు,
- అభిమానుల మధ్య నామినేషన్ దాఖలు
- ఒకే ఒక్క నామినేషన్ కావడంతో లాంఛనమైన ఎన్నిక
- నేడు అధికారికంగా ప్రకటించనున్న పార్టీ అధిష్ఠానం
- ఎవరూ నామినేషన్ దాఖలు చేయకుండా ఏకగ్రీవం చేసిన అధిష్ఠానం
- తెలంగాణ ప్రజలు బిజెపిని అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు
- :: మీడియాతో రామచంద్రరావు



హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ (బిజెపి) రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై ఆ పార్టీ అధిష్టానం ఉత్కంఠకు తెరదించింది. ఆశావహులందరిని పక్కన పెట్టి అనూహ్యంగా మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచందర్ రావు పేరును ఖరారు చేసింది. పార్టీ అధిష్టానం రామచంద్రరావు పేరును ప్రతిపాదించి రాష్ట్ర శాఖకు తెలియజేసింది. దీంతో తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు పార్టీ అధిష్టానం సోమవారం నామినేషన్లు స్వీకరించింది. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో అధ్యక్ష ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రామచంద్రరావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సాయంత్రం 5 గంటలతో నామినేషన్ దాఖలు చేసేందుకు గడువు ముగిసింది. అప్పటి వరకు రామచందర్ రావు ఒక్కరే అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అయ్యింది. రామచందర్ రావును అధ్యక్షుడిగా

(మిగతా 2వ పేజీలో)

## బీజేపీకి రాజాసింగ్ రాజీనామా!



- కిషన్‌రెడ్డి లేఖ అందజేత
- కొత్త అధ్యక్షుడి ప్రకటనతో అంతా నిరాశలో ఉన్నారు
- నన్ను నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు: రాజాసింగ్
- రాజాసింగ్‌పై రాష్ట్ర కమిటీ ఆగ్రహం
- ఆయన క్రమశిక్షణరాహిత్యం పరాకాష్టకు చేరిందని ప్రకటన

## అలాంటి అధికారుల ఫొటోలు ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి: తెలంగాణ హైకోర్టు




### ఇంజినీరింగ్ కోర్సులకు

## పాతఫీజులే



- ఈ ఏడాది కొనసాగిస్తూ ప్రభుత్వం
- ఉత్తర్వులు బిటెక్, ఎంటెక్, ఎంసిఎ,
- ఎంబిఎ, ఒకేషనల్ కోర్సులకు వర్తింపు
- కొన్ని కాలేజీలు తప్పుడు లెక్కలు
- సమర్పించినట్టు ఆరోపణలు త్వరలో
- నిపుణుల కమిటీ ఏర్పాటు ఇతర
- రాష్ట్రాల్లో అమలవుతున్న ఫీజులపై పరిశీలన




## బనకచర్లకు బ్రేక్

- అనుమతులకు కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ నో
- ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయి
- జిడబ్ల్యుడిటి తీర్పును పరిశీలించాల్సి ఉంది
- పోలవరం-బనకచర్ల లింక్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలకు చుక్కెదురు
- నెగ్గిన తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయం:
- మంత్రి ఉత్తమ్ నిబంధనల ప్రకారమే కేంద్ర వ్యవహరిస్తుందనడానికి
- ఇది ఉదాహరణ :బండి సంజయ్ నిపుణుల కమిటీ నిర్ణయాన్ని
- స్వాగతిస్తున్నాం.. ప్రాజెక్టు నిలిపివేసే వరకు పోరాటం: హరీశ్‌రావు

## తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికే రోల్‌మోడల్ కావాలి

- పౌష్టికాహారం, బోధనలో అగ్రగామిలా ఉండేలా కార్యాచరణ
- భవనాల నిర్మాణంలో అధునాతన సాంకేతికత వినియోగం
- పిల్లలు పట్టించుకోని వృద్ధులకు అండగా నిలవాలి
- వారి వేతనాల నుంచి తల్లిదండ్రులకు వాటా జమ చేయాలి
- రవాణాతోపాటు ఇతర శాఖల్లోనూ ట్రాన్స్‌జెండర్ల సేవలు
- దివ్యాంగులకు మరింత అండగా రాష్ట్ర ప్రభుత్వం
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 30 : మురికివాడలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఆయా పిల్లలకు బోధన చేసేందుకు ఆసక్తి చూపితే.. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
మంగళవారం,
జూలై 1, 2025



# ఇంజనీరింగ్ కోర్సులకు పాతఫీజులే

హైదరాబాద్ : ఇంజనీరింగ్ ఫీజుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణ యం తీసుకుంది. బి.టెక్ కోర్సులకు 2025 –26 విద్యాసంవత్సరానికి పాత ఫీజులనే కొనసాగిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బి.టెక్, ఎం.టెక్, బి.ఆర్క్, ఎం.ఆర్క్, బి.ఫార్మసీ, ఎం. ఫార్మసీ, ఫార్మా డి, ఎంబిఎ, ఎంసిఎ, ఎంబిఎ ఇంటిగ్రేటెడ్, బి. ఒకేషనల్ కోర్సులకు తాజా ప్ర భుత్వ నిర్ణయం వర్తించనుంది. ఈ నిర్ణయం తో పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తప్పనుంది. ఇంజనీరింగ్ కోర్సు విద్యార్థులకు ఆర్థిక సాయం కింద ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌ను కూడా అందిస్తోంది. ఫీజులపై త్వరలో ని పుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఫీజులను ఆ కమిటీ పరిశీలిస్తుందని, వాటితోపాటు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సుప్రీం కోర్టు, హైకోర్టుల ఆదేశాల మేరకు ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కొన్ని క ళాశాలలు అధ్యాపకులకు ఎక్కువ మొత్తంలో వే తనాలు ఇచ్చినట్లు, నిర్వహణ పనులకు అధికం గా ఖర్చు చేసినట్లు తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటి(టిఎఎఫ్‌ఆర్‌సి)కి తప్పు డు లె క్కలు సమర్పించాయన్న ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఫీజులపై హేతుబద్ధమైన నిర్ణ యం తీసుకోవాలని భావించిన ప్రభుత్వం కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది, ల్యా బ్‌లు, భవనాలు, బోధన ప్రమాణాలు, ఇతర వసతుల వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ఈ ఏడాది పాత ఫీజులను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఇంజనీరింగ్ కోర్సులకు ఫీజుల పెంపు లేదని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. మరోవైపు పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఇసెట్ ద్వారా నేరుగా బి.టెక్, బి.ఫార్మసీ ద్వితీయ సంవత్సరంలో కోర్సులో చేరనున్నారు. దీంతో ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులకు కూడా తాజా నిర్ణయం ప్రకారం పాతన ఫీజులే వర్తించనున్నాయి.

**కౌన్సెలింగ్ నిర్వహణ**

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇంజనీరింగ్ ప్రవేశాల నిర్వహించే తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా, మంగళవారం(జులై 1) నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కానుంది. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సోమవారం సాయంత్రం వరకు 64,190 మంది విద్యార్థులు స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. ఈనెల 7వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంది. స్లాట్ బుకింగ్ ఆధారంగా ఈ నెల 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 18వ తేదీన సీట్ల కేటాయింపు జరగనుంది. అంతకుముందు ఈసారి కొత్తగా జోసా తరహాలో నెల 13వ తేదీన మాక్ సీట్ కేటాయింపు చేయనున్నారు. అనంతరం ఈ నెల 14, 15 తేదీలలో అవసరమైతే వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం కల్పించారు. ఈసారి మొత్తం మూడు విడతల్లో ఈ ప్రక్రియ కొనసాగనుంది.




# అలాంటి అధికారుల ఫొటోలు ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ తాలూకా ఖానామెట్‌లోని తమ భూమిలో రాయపాటి ప్రతిభ, రాయపాటి శ్రీహర్ష, జీబీ ప్రసాద్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటూ సయ్యద్ రహీమున్నిసా సహా మరో ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 'నోటీసులిస్తారు కూల్చి వేతలు ఉండవు. వచ్చే సోమవారం నుంచి ప్రతీ వారం చేపట్టిన కూల్చివేతల వివరాలు కోర్టు ముందు ఉంచేలా స్టాండింగ్ కౌన్సెళ్లకు ఆదేశాలిస్తా. అనధికారిక నిర్మాణాలకు, నగర విధ్వంసానికి ఈ స్టాండింగ్ కౌన్సెళ్లు, అధికారులే బాధ్యులు. ఎవరికి వారు మా పని మేం చేశామంటూ చేతులు దులుపుకుంటున్నారు. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశామని స్టాండింగ్ కౌన్సెళ్లు.. ఉత్తర్వులిచ్చాం, టాస్‌ఫోర్స్‌కు బదిలీ చేశామని జీహెచ్‌ఎంసీ కమిషనర్.. ఈ లేఖను పోలీసులకు అందజేశామని టాస్‌ఫోర్స్.. శాంతిభద్రతల్లో తలమునకలై మేం ఆ పనిని వాయిదా వేశామని పోలీసులు.. ఇలా ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి అధికారులు, స్టాండింగ్ కౌన్సెళ్ల పేర్లు రాత్రి పూట కూడా స్పష్టంగా కనిపించేలా ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్‌పై విద్యుత్ దీపాలతో పోస్టర్లు వేయించాలి'అని అసహనం వ్యక్తంచేశారు.

# 250 రోడ్లు మూసివేత.. 130 చోట్ల కరెంట్ కట్

## ఎడతెగని వానలతో హిమాచల్‌లో స్తంభించిన జనజీవనం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. దాదాపు రాష్ట్రమంతటా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. కనీసం 130 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. వరద చేరడం, ధ్వంసం కావడం వంటి కారణాలతో 250 రోడ్లను అధికారులు మూసివేశారు. ఇందులో అత్యధికంగా సిర్మౌర్ జిల్లాలో 57, మండి జిల్లాలో 44 రోడ్లున్నాయి. రాష్ట్రంలో కొండచరియలు విరిగిపడే అవకాశమున్న 22 ప్రాంతాలకుగాను 18 చోట్ల ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. కంగ్రా, మండి, సిర్మౌర్, సొలాన్ జిల్లాల్లో సోమవారం స్కూళ్లను మూసివేశారు. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. పర్యాటక ప్రాధాన్యమున్న సిమ్లా–కల్కా రైలు మార్గంపైన చేరిన రాళ్లు, చెట్లను తొలగించే రాకపోకలకు వీలు కల్పించారు. గత 24 గంటల్లో చనిపోయిన ముగ్గురితో కలిపి ఈ సీజన్‌లో వర్షాల సంబంధిత ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 20కి చేరిందని అధికారులు తెలిపారు. సిమ్లా–కల్కా ఐదో నంబర్ జాతీయ రహదారిపై కోటి సమీపంలో కొండచరియలు విరిగి పడటంతో గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి.

# ప్రాణాలు బుగ్గిపాలు



అంటున్నారు. పరిశ్రమ ఆవరణలో భీతావహ వాతావరణం నెలకొంది. ఘటనా స్థలాన్ని మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర అధికారులు సందర్శించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఘోర దుర్ఘటనపై ప్రధాని మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తదితర ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

**బ్లోయర్ పేలి.. రియాక్టర్‌కు అంటుకుని..**

మందుల తయారీకి సంబంధించిన ఈ పరిశ్రమలో కన్సిస్టెన్స్ మైక్రోస్టెల్లయిన్ సెల్యులర్ పౌడర్‌ను ఉ త్పత్తి చేస్తారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం.. ఉదయం 9.10 గంటల ప్రాంతంలో మొత్తం 111 మంది కార్మికులు, ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అంతా పనిలో నిమగ్నమై ఉండగా తొలుత హెయిర్ బ్లోయర్ పేలింది. దీంతో ఎగసిన మంటలు సమీపంలో ఉన్న రియాక్టర్‌కు అంటుకోవడంతో చెవులు చిల్లులు పడిపోయేంత శబ్దంతో భారీ పేలుడు సంభవించింది. భూమి కంపించినట్టు అయ్యింది. కొందరు కార్మికులు వెంటనే బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు.

**మృతుల్లో యాజమాన్య ప్రతినిధి?**

మృతులు, గాయపడిన వారిలో ఎక్కువగా ఒడిశా, బిహార్, యూపీ వాళ్లే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. మరణించిన వారిలో ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెందిన గోవన్ అనే వ్యక్తి కూడా ఉన్నారని అధికారవర్గాలు వెల్లడించాయి. ఆయన ఫ్యాక్టరీలోకి వచ్చిన కొద్ది సేపటికే ఈ పేలుడు సంభవించిందని తెలిపాయి.

**అర్ధరాత్రి వరకు కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్**

సిగాచి పరిశ్రమ భవనాల శిథిలాల కింద కార్మికులు చిక్కుకుపోయి ఉంటారనే అంచనాతో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. భారీ కట్టర్లు, క్రేన్‌లు, హిటాచీలతో శిథిలాల తొలగింపును చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కురిసిన చిన్న పాటి వర్షం సహాయక చర్యలకు కొంత అంతరా యం కలిగించింది. అయితే రెస్క్యూ ఆపరేషన్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. మంగళవారం కూడా శిథిలాల తొలగింపు చర్యలు కొనసాగనున్నాయి.

**మిన్నంటిన రోదనలు.. ఆందోళన**

కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. విధులకు హాజరై ఆచూకీ లేకుండా పోయిన వారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ వారి ఆచూకీ అధికారులను ఆరా తీశారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు. పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి దామోదర రాజనర్సింహ నాలుగు గంటల పాటు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌కు పలు సూచనలిచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పరిశ్రమల శాఖ ఫైర్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఎయిర్ ఫైర్ సిస్టమ్‌లో ప్రెషర్ వల్లే సిగాచీ పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకుందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ స్పష్టం చేశారు. ఇప్పటికే పరిశ్రమల శాఖ అధికారులు దీనిపై విచారణ ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వం తరఫున మెరుగైన ఎక్స్‌గ్రేషియా అందించేందుకు కృషి చేస్తామన్నారు.

**రాజకీయం చేయొద్దు: మంత్రులు**

పేలుడు ఘటనలో గాయపడిన వారిలో హేమ సుందర్, ధర్మరాజ్ ప్రసాద్, రాజేష్ కుమార్ చౌదరి, కమలేష్ ముఖియా, చందన్‌కుమార్ నాయక్, నగ్నజిత్, అభిషేక్ కుమార్, అజిత్ తివారి, సంజయ్‌కుమార్, యశ్వంత్ కుమార్, ధన్‌వీర్ కుమార్, సంజయ్ ముఖియా, రాజశేఖర్‌రెడ్డి, దేవనంద్, గణేష్ కుమార్, సంజయ్‌కుమార్ యాదవ్, నీలాంబర్ బత్రా, సమీర్, అమర్జిత్, అర్జున్‌కుమార్, అజీమ్ అన్సారీలను మియాపూర్ మదీనాగూడలోని ప్రణామ్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ అభిషేక్ కుమార్, అజిత్ తివారి మృతి చెందారు. ముగ్గురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రివర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రిలో ఉన్నవారిని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దీనిపై ఎవరూ ఎలాంటి రాజకీయం చేయవద్దని కోరారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఇందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు.

**సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..**

సిగాచీ పరిశ్రమలో ప్రమాదం నేపథ్యంలో బాధిత కుటుంబాలకు సహాయం కోసం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. తక్షణ సహాయం కోసం సంబంధిత వ్యక్తులు 08455–276155 నంబర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు.

**నేడు సీఎం సందర్శన**

సిగాచి పరిశ్రమను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు సందర్శించనున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించనున్నారు. అక్కడి కార్మికులతో మాట్లాడనున్నారు. సహాయక చర్యలను కూడా పరిశీలిస్తారు.

**కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి: కేసీఆర్**

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ప్రమాదానికి కారణాలపై విచారణ జరిపించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని, చనిపోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇలావుండగా పాశమైలారం పరిశ్రమలో రియాక్టర్ పేలుడు అత్యంత విషాదకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పలువురు కార్మికులు చనిపోయారన్న వార్త తనను తీవ్రంగా కలచి వేసిందని అన్నారు.

**రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని**

న్యూఢిల్లీ: సంగారెడ్డి జిల్లాలో సంభవించిన పేలుడు ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రధాని తక్షణ ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున, గాయపడ్డ వారికి రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. 'ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నా. తమకు ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నా. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా..' అని మోదీ పేర్కొన్నారు. 'ఈ ఘోర ప్రమాదం గురించి విని చాలా బాధ కలిగింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తక్షణ సహాయ, రక్షణ చర్యలు చేపడుతున్నారు..' అని రాహుల్ పేర్కొన్నారు. 'ఈ ఘోర ప్రమాదంలో అమూల్యమైన ప్రాణాలు పోవడం ఎంతో దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం..' అని ఖర్గే అన్నారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. ప్రమాదంపై ఆరా**

హైదరాబాద్: పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. డీజీపీ జితేందర్, సీఎస్ రామకృష్ణారావుతో సమీక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరాయంగా కొనసాగించేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం తరఫున సీఎస్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. డిజాస్టర్‌మేనేజ్‌మెంట్‌స్పెషల్ సీఎస్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఫైర్‌సర్వీసెస్‌అడిషనల్‌డీజీని సభ్యులుగా నియమించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సిఫారసు చేసే బాధ్యతను కమిటీకి అప్పగించారు.

# రాంచందర్‌రావుకు పట్టం

బిజెపి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మంగళవారం ప్రకటిస్తారు. ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర కమల దళానికి నాయకత్వం వహించే అధ్యక్ష ఎన్నిక రేసులో మొదటి నుంచి బలంగా వినిపించిన ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ చివరికి అధిష్టానం నిర్ణయంతో అధ్యక్ష రేసు నుంచి వైదొలిగారు. పార్టీ కేంద్ర నాయకత్వంతో రామచందర్ రావు వైపు మొగ్గు చూపడంతో ఇంకెవరు అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయలేదు. అధిష్టానం ఆదేశాల మేరకు ఇతర నేతలు ఎవరు నామినేషన్ వేయకుండా పార్టీ జాగ్రత్త పడ్డంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు దోహదపడింది. అంతకు ముందు రామచంద్రరావు నామినేషన్ దాఖలు చేసేందుకు కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ ర్యాలీగా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఆ కోలాహలం మధ్య అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయి బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని రాంచందర్ రావు చెప్పారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు. నేతలందరితో కలిసి పనిచేస్తానని, రాష్ట్ర బిజెపిలో ఎటువంటి గ్రూప్‌లు లేవని, అంతర్గతంగా ఎలాంటి వివాదాలు లేవని రామచంద్రరావు స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లే ముందుకు రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ 40 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నానని తెలిపారు. తనకు అన్ని వర్గాల ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం తనకు చాలా పెద్ద బాధ్యత అప్పగించిందన్న ఆయన పార్టీ అంచనాలకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు. తన ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగబోతున్నాయని అన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు అందరితో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతానని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం నుంచి ప్రస్తానం ప్రారంభించిన రామచంద్రరావు ఎమ్మెల్సీగా, ఇప్పుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా అంచలంచెలుగా ఎదిగారు. ఆయన రాజకీయ ప్రస్థానం ఇలా సాగింది. రామచందర్ రావు 1959 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో జన్మించారు. పాఠశాల విద్యతో పాటు ఇంటర్మీడియట్ పూర్తి చేసి సికింద్రాబాద్ రైల్వే డిగ్రీ కాలేజీలో చేరి విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1982– నుంచి 1985 మధ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం కార్యదర్శిగా పని చేశారు. అలాగే భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర తొలి కార్యదర్శిగా కూడా నియమితులై తన వంతు సేవలు అందించారు. అనంతరం బిజెపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాఖ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇదిలావుంటే రామచందర్ రావు 2009లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికల్లో మహబూబ్‌నగర్ రంగారెడ్డి %–% హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థి చింతల కనకారెడ్డి చేతిలో 2,768 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. కాగా 2015లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల్లో మహబూబ్‌నగర్, %–% రంగారెడ్డి –, హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప టీఆర్ఎస్ అభ్యర్థి జి.దేవీప్రసాద్ రావుపై గెలిచి తొలిసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజ్గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు చేతిలో 73,698 ఓట్ల తేడాతో ఓటమి పొందారు. 2021లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల్లో కూడా మహబూబ్‌నగర్ %–% రంగారెడ్డి %–% హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి సురభి వాణిదేవి చేతిలో ఓటమి పాలయ్యారు.

# బీజేపీకి రాజాసింగ్ రాజీనామా!

హైదరాబాద్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడిగా ఎన్.రామచంద్రరావు పేరు ప్రచారంలోకి రావడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను పార్టీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి సోమవారం అందజేశారు. ఆ రాజీనామా లేఖలో తన రాజీనామాకు కారణాలు తెలియజేస్తూ రాజాసింగ్ బిజెపిలో లేరని, ఆ ఎమ్మెల్యేతో తమకు సంబంధం లేదని శాసనసభ స్పీకర్‌కు తెలియజేయాలని రాజాసింగ్ కిషన్‌రెడ్డికి సూచించారు. కాగా తన అనచురులతో అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేసేందుకు రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చానని, అయితే తన అనుచరులను బెదిరించి తనకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకుని నామినేషన్ దాఖలు చేయనివ్వలేదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలామంది మౌనంగా ఉన్నంత మాత్రాన దానిని అంగీకారంగా భావించవద్దని పేర్కొన్నారు. తాను నా ఒక్కడి గురించే మాట్లాడటం లేదని, మనల్ని నమ్మి, మన వెంట నిలిచిన లెక్కలేనంత మంది కార్యకర్తలు, ఓటర్ల తరఫున మాట్లాడుతున్నానని అన్నారు. వారంతా ఈ రోజు తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. తనపై ఉన్న నమ్మకంతో పార్టీ వెంట నడిచిన కార్యకర్తలు, మద్దతుదారులు ప్రస్తుతం తీవ్ర నిరాశలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ గెలవకూడదని కోరుకునే వాళ్లు పార్టీలో ఎక్కువ మంది ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. పార్టీ పదవుల నియామకాల్లో నా వాడు, నీ వాడు అంటూ నియమించుకుంటూ వెళితే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాజాసింగ్ హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించి సరైన వ్యక్తిని నియమించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన ఇకపై బీజేపీలో కొనసాగలేనని అందుకే రాజీనామా సమర్పించానని స్పష్టం చేశారు. 2019 నుంచి పార్టీ కోసం ఎన్నో కష్టాలు పడ్డానని, పార్టీ కోసమే తాను ఉగ్రవాదులకు టార్గెట్ గా మారానని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రాజీనామా చేసిన తర్వాత కేంద్రమంత్రి బండి సంజయ్ రాజాసింగ్‌ను నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్టీ కోసం అందరం కలిసిగట్టుగా పని చేద్దామని కోరారు. తాను తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునే ప్రసక్తి లేదని రాజాసింగ్ తేల్చి చెప్పారు.

## తెలంగాణ అంగన్‌వాడీలు

# దేశానికే రోల్‌మోడల్ కావాలి

నిలిచేలా తీర్చిదిద్దాలన్నారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఐదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యనందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని నిర్దేశించారు. సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై ముఖ్యమంత్రి తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలకు నూతన భవనాల నిర్మాణం అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలని, పిల్లల అవసరాలకు తగినట్లు కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయించాలని సూచించారు. సోలార్ ప్లేట్లు, బ్యాటరీ బ్యాక్‌పతో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయం, ఎక్కువ సౌకర్యం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న కంటైనర్ కేంద్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

# నాలానిర్మాణం పనులతో పాటు నూతన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులకు చర్యలు చేపట్టి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలి

## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్ (వాయిస్‌టుడే) జూన్ 30: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ రామిరెడ్డి నగర్, పాపయ్య యాదవ్ నగర్ లలో వివిధ విభాగాల అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా సుచిత్ర, అల్వాల్, బ్యాంక్ కాలనీ వంటి ప్రాంత వాసులు త్వరగా వారి గమ్యస్థానాలను చేరేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఐడిపిఎల్ నుంచి రామ్ రెడ్డి నగర్, పాపయ్య యాదవ్ నగర్ ల మీదుగా ఉన్న రోడ్డుపై ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వాహనాలు తిరగడం వల్ల తీవ్ర రద్దీగా మారుతుందని, పోటీ పరీక్షల సమయాల్లో అయితే ఇది మరింత రద్దీగా మారుతుందని తద్వారా పిల్లలు, కాలనీలలోని వయోవృద్ధులు ఆ రోడ్డులో నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను తగ్గించేందుకు ఐడిపిఎల్ నుంచి దిల్ కుష్ నగర్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణము చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా పాపయ్య యాదవ్ నగర్, రాంరెడ్డి నగర్ లలో నెలకొని ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు, బ్రిడ్జి నిర్మాణం మరియు విస్తరణ, 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు, మసీదు నుండి భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టడం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.



ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... ఐడిపిఎల్ నుంచి దిల్ కుష్ నగర్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణంతోపాటు, నాలా బ్రిడ్జి పనులను, రామిరెడ్డి నగర్ లో నూతన కల్వర్టు నిర్మాణము, భూగర్భ డ్రైనేజీ పనులను, ప్రధాన రహదారిని 100 ఫీట్లకు విస్తరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో 2020వ సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వము గెజిట్ ద్వారా దిల్ కుష్ నగర్ నుంచి పాపయ్య యాదవ్ నగర్ వరకు చేపట్టడం జరిగిందని, తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించామని, ఈ ఐడిపిఎల్ మెయిన్ రోడ్డు నుంచి రామ్ రెడ్డి నగర్, పాపయ్య యాదవ నగర్ లకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యను మరింత పరిష్కరించవచ్చని అన్నారు. అనంతరం స్థానిక హనుమాన్ దేవాలయం నందు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, నాయకులు సురేందర్ రెడ్డి, బొంబాయి శ్రీను, నార్లగంటి బాలయ్య, నార్లకంటి రమేష్, రమణారెడ్డి, రామిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదవ రెడ్డి, ఉపాధ్యక్షులు హీరాలాల్ భాటి, పాపిరెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్ గౌడ్, రవీందర్ రెడ్డి, జయేంద్ర గౌడ్, సత్యనారాయణ, పాపయ్య యాదవ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భవ్ నారాయణ, సాయి బాబు, నరసింహ రెడ్డి, పీసీ రావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యూసఫ్‌గూడ బ్రాంచ్‌లో గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాం

శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యూసఫ్ గూడ బ్రాంచ్ లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు... ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు అందరూ మొక్కలు నాటారు తరువాత ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ నీలావతి మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం మనందరి బాధ్యత కాబట్టి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి మన భవిష్యత్తు తరాలకు పచ్చని భారతదేశాన్ని అందించాలని విద్యార్థులకు సూచించారు... ఈ కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ ఆర్ ఐ అనిత కోఆర్డినేటర్ మురళీకృష్ణ డీన్ రమేష్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు..





## అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో రియాక్టర్ అకస్మాత్తుగా పేలి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పేలుడు ధాటికి పరిశ్రమలో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొందరు కార్మికులు ప్రాణాలు కోల్పోవగా, కొందరికి తీవ్రగాయాలు అవ్వడంతో వారిని తక్షణమే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెంటనే స్పందించి బాధిత కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, సంఘటన స్థలాన్ని పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి వివేక్ వెంకటస్వామి ,పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు..

## హైదరాబాద్ మెట్రోకు అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్: జర్మనీలోని హాంబర్గ్‌లో ఇటీవల జరిగిన 'ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్' (యూఐటీపీ)–2025 పురస్కారాల ప్రదానోత్సవంలో హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ (ఎల్అండ్‌టీ ఎమ్ఆర్‌హెచ్ఎల్)కి ప్రత్యేక గుర్తింపు లభించింది. రోడ్స్, ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్‌టీఏ) తోడ్పాటుతో 'ఆప్టిమైజ్డ్ మెట్రో ఆపరేషన్ ప్లాన్స్ లీడింగ్ టు ఇన్‌క్రీజ్డ్ రెవెన్యూ ఫర్ ట్రెయిన్' ప్రాజెక్టుకుగాను పురస్కారం దక్కింది. ఈ మేరకు సంస్థ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లోని రాకపోకలను సమర్థంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టులకు యూఐటీపీ ఏటా పురస్కారాలు ఇస్తుంది. 2025 ఎడిషన్‌కి ప్రపంచవ్యాప్త అగ్రగామి ట్రాన్సిట్ ఆపరేటర్ల నుంచి సుమారు 500 ఎంట్రీలు వచ్చాయి. 'ఆపరేషనల్ ఎక్సలెన్స్' కేటగిరిలో హైదరాబాద్ మెట్రో సమర్పించిన ఎంట్రీకి టాప్ 5 తుది జాబితాలో చోటు దక్కింది. డేటా సమర్థత ఆధారిత విధానాలకుగాను ప్రత్యేక గుర్తింపు లభించింది. 'నిర్వహణ సామర్థ్యాలు, వినూత్న వ్యూహాలతో హైదరాబాద్ మెట్రోను ప్రపంచ వేదికపై నిలబెట్టడం గర్వంగా ఉంది.' అని కేవీబీ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# తండ్రికి దగ్గ తనయుడు ముకుల్

### జన్మదిన సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు

### ఫౌండేషన్ బాధ్యతలను తనయునికి అప్పజెప్పిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

కంటోన్మెంట్: జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి) న్యూ బోయిన్ పల్లి పెన్షన్ లైన్ లోని వాలీబాల్ గ్రౌండ్ లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తనయుడు ముకుల్ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కంటి ఆపరేషన్ల కోసం లయన్స్ ఐ హాస్పిటల్ మారేడ్పల్లికి రెండు లక్షల రూపాయల విరాళం కూడా అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు. లయన్స్ క్లబ్ మరియు మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున హాజరైన స్థానిక ప్రజలు వివిధ రకాల వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించుకున్నారు అనంతరం ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ముకుల్ కు ఆశీర్వాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదయిన వైద్యం చేయించుకోలేని వారి కోసం ఉచితంగా వైద్య సేవలు అందించడం కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు, ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం గానూ లయన్స్ ఐ హస్పిటల్ మారేడ్ పల్లికి రెండు లక్షల రూపాయల విరాళం అందజేసామని, హస్పిటల్ కు భవిష్యత్ లో కూడా అండగా ఉంటానని అన్ని రకాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు.



తను ఎమ్మెల్యే అయిన తరువాత సేవా కార్యక్రమాలకు సమయం కేటాయించలేక పోవడంతో ఇక నుండి ఎస్జీఎఫ్ తరపున సేవా కార్యక్రమాల బాధ్యత ను తన కుమారుడు ముకుల్ తీసుకుంటాడని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే కుమారుడు ముకుల్ మాట్లాడుతూ నా తండ్రే నాకు ఆదర్శమని ఆయన మార్గంలో నడుస్తూ ప్రజాసేవ చేస్తానని, మా తండ్రి మీద చూపిన ఆదరాభిమానాలు తన మీద కూడా చూపాలని సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ముకుల్ కు పలువురు నాయకులు, శిబిరానికి వచ్చిన ప్రజలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, సంతోష్ యాదవ్, బల్వంత్ రెడ్డి, సదానందం, కాంగ్రెస్ నాయకులు అభిమానులు స్థానిక ప్రజలు భారీ ఎత్తున హాజరై ఎమ్మెల్యే కుమారుడు ముకుల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## రసాయన కర్మాగారంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం పట్ల

### బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి



సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని ఒక రసాయన కర్మాగారంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య ఇంకా పెరుగుతుండవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై విచారణ జరిపించాలని, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఎంపీ వద్దిరాజు సూచించారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ రవిచంద్ర తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

## ఎంపీ వద్దిరాజును కలిసిన గొల్లచర్ల ముదిరాజ్ ప్రముఖులు



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్లకు చెందిన ముదిరాజ్ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఎంపీ రవిచంద్రను సోమవారం సాయంత్రం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు సంతోష్,మల్లయ్య, బలరాం, శ్రీనివాస్, ప్రసాద్, సురేష్,ఉప్పయ్యలు కలిసి తమ స్వగ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణానికి సాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



## విద్యార్థులకు పుస్తకాలు మరియు ప్రింటర్ పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 30(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో లిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పుస్తకాలు మరియు పింటర్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు..

అనంతరం ప్రభుత్వ బడుల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు సహకరిస్తున్న గణేష్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు..

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. షాపూర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న ఎంఈఓ ఆఫీస్ కోసం మంజూరైన 54 లక్షలతో భవనం పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు..

నాలుగు గోడల మధ్య ఉన్న విద్యార్థుల ఆలోచనలే రేపటి బంగారు భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల కోసం ప్రభుత్వ బడులలో అనేక సౌకర్యాలను సమకూరుస్తుందన్నారు. కావున ప్రభుత్వ బడిలో అడ్మిషన్లు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేందర్ గౌడ్, బుచ్చి రెడ్డి, మండల విద్యాధికారి జెమిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత కుమారి, శ్రీహరి, యాదగిరి, శివ, కృష్ణ ప్రసాద్, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, మాధవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కలిసిన పైప్‌లైన్ రోడ్ శ్రీ లక్ష్మిగంగా ఎంక్లేవ్ కాలనీవాసులు

కుత్బుల్లాపూర్ జూన్ 30(వాయిస్ టుడే) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 132 జీడిమెట్ల డివిజన్,పైప్ లైన్ రోడ్, శ్రీ లక్ష్మిగంగా ఎంక్లేవ్ లో గత 20 సంవత్సరాల నుండి 350 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.. గతంలో నుండి 40 ఫిట్ల రోడ్డు ఉంది కాని ఇప్పుడు రోడ్డు వైండింగ్ లో భాగంగా 60 ఫిట్ల రోడ్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు మార్కింగ్ చేసారని ఎలాగైనా తమ కుటుంబాలకు ఆదుకోవాలని లిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ లి శ్రీ లక్ష్మిగంగా ఎంక్లేవ్ కాలనీవాసులు కలిసి విన్నవించుకున్నారు..

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ శ్రీ లక్ష్మిగంగా ఎంక్లేవ్ కాలనీవాసులు అందజేసిన వినతిపత్రం పట్ల వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వారందరి కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాలప్ప, బండి శ్రీనివాస్ గౌడ్, కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రెటరీ రమణ రెడ్డి, ఉపాధ్యక్షులు పెంటరెడ్డి, సెక్రెటరీ కృష్ణయ్య, సభ్యులు కౌశిక్, సురేందర్ ప్రసాద్, నాయుడు పాటు కాలనీవాసులు పాల్గొన్నారు..



## ప్రమాద ఘటన బాధాకరం...

**ముమ్మరంగా సాగుతున్న సహాయక చర్యలు..**

**ప్రతి క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం..**

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి...**

**ప్రభుత్వం తరపున ఆదుకుంటాం..**

**నీలం మధు ముదిరాజ్..**

పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పాశమైలారంలోనీ సిగాచి పరిశ్రమలో సంభవించిన ప్రమాదం బాధాకరమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.

సోమవారం మంత్రులు దామోదర రాజ నరసింహ, వివేక్ వెంకటస్వామి, జిల్లా అధికారుల వెంట ప్రమాద స్థలాన్ని పరిశీలించడంతో పాటు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాదం సంభవించిన వెంటనే అప్రమత్తం అయిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. గాయపడిన 26 మందికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రిలకు తరలించే విధంగా ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనుకోకుండా జరిగిన ఈ ప్రమాదం దురదృష్టకరమని, ప్రమాద బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,పటాన్చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆషాడ మాసంలో గోరింటాకు సెలబ్రేషన్స్



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆషాడం మాసం పురస్కరించుకొని బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో తార్నాక లోని మహిళా మోర్చా అధ్యక్షురాలు ద్రాక్షారం అనిత నివాసంలో గోరింటాకు సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు భారీగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోరింటాకును తీసుకొచ్చి సాంప్రదాయ బద్ధంగా దంచి ఒకరికొకరు గోరింటాకును చక్కగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ గోరింటాకులో వేడిని తగ్గించే గుణం తోపాటు రోగ నిరోధక శక్తిని పెంచి రక్తం ప్రసరణ సక్రమంగా జరిగేలా చూస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆషాడ మాసం సమయంలో గోరింటాకు పెట్టుకోవాలనే ఆచరణ ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ ఆచరణతో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శారద మల్లేష్,మంగ,అనూష తో పాటు బిజెపి మహిళా మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి పార్టీ బీసీల ద్రోహి....
## బీసీ సంఘాలు....

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): బీజేపీ పార్టీ బీసీల ద్రోహి అని, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా రామచంద్ర రావును ప్రకటించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని బీసీ సంఘాలు పేర్కొన్నాయి. సోమవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటి రాష్ట్ర కార్యాలయంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగౌని బాలరాజ్ గౌడ్, గౌడ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ బీసీ సమైక్య అధ్యక్షులు ఎస్. దుర్గయ్య గౌడ్ లు మాట్లాడారు. బీజేపీ పార్టీలో మెజార్టీ ప్రజలైన బీసీలను అవమానించి ఓసీలకు అధ్యక్ష పార్టీని కట్టబెట్టిందని విమర్శించారు. ఇదేనా బీసీలకు ఇచ్చే గౌరవం, బీసీల పట్ల బీజేపీ చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను ఓట్లు వేసే యాత్రలుగా చూస్తే సహించబోమని హెచ్చరించారు. ఓట్లు మావి, సీట్లు మీవా అని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిన ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల సమయంలో బీసీ అయిన బండి సంజయ్ ను తొలగించి కిషన్ రెడ్డికి అప్పగించారని ఆరోపించారు. 4 గురు పార్లమెంట్ సభ్యులు ఉన్నప్పటికీ వారేవరికి కనీసం అవకాశం ఇవ్వలేదని నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజా సింగ్ ను సైతం నామినేషన్ వేయాడానికి అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు ద్రోహం చేస్తే బీజేపీ పుట్టగతులు వుండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బెరుశేఖర్, నాగేశ్వర్ గౌడ్, బడేసాబ్, బాలగౌని వెంకటేష్ గౌడ్, పోతగాని ఐలాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే సిగాచి పరిశ్రమ ఘటన

**మృతులకు కోటి రూపాయల పరిహారం, ఉద్యోగం కల్పించాలి**

**ప్రతి పరిశ్రమను నిరంతరం తనిఖీ చేయాలి..**

**తూతు మంత్రంగా ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తనిఖీలు**

**గాయపడ్డ వారికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలి..**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్**



పటాన్చెరు : యాజమాన్యం నిర్లక్ష్యం.. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల తూతూ మంత్రంగా చేపట్టే తనిఖీల మూలంగానే సిగాచి పరిశ్రమ ఘటన చోటు చేసుకుందని. పేలుడులో మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, గాయపడిన వారికి మెరుగైన వైద్యంతో పాటు 50 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

పటాన్చెరు నియోజకవర్గ పాశమైలారం పారిశ్రామిక వాడలో గల సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం రియాక్టర్ పేలుడు జరిగిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జిఎంఆర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిఐజి ఇక్బాల్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఎస్పీ పరితోష్ పంకాజ్ తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పరిశ్రమ నడిపిస్తున్న సిగాచి యాజమాన్యం ఎప్పుడు కూడా కార్మికుల భద్రత కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో మృతి చెందారని తెలిపారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన పరిశ్రమల తనిఖీల విభాగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికుల భద్రతను గాలికి వదిలేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఒకసారి ప్రమాద సంఘటన జరిగినప్పటికిని యాజమాన్యం గుణపాఠం నేర్చుకోకుండా తిరిగి భద్రతా ప్రమాణాలు పాటించకుండా పరిశ్రమలు నడిపిస్తూ కార్మికుల పాలిట యమపాశంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి.. ఘటనకు కారకులైన యాజమాన్యం, నిర్లక్ష్యం వహించిన పరిశ్రమ విభాగం అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మెరుగైన విద్య కోసం గ్రేడ్ 2 హెడ్మాస్టర్లకు పదోన్నతులు కల్పించాలి

**24 సంవత్సరాలుగా ఒకే క్యాడర్లో పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించాలి....**

**గెజిటెడ్ హెడ్మాస్టర్ ఆస్పిరంట్ ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ నజీముద్దీన్**



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన విద్య కోసం గ్రేడ్ 2 హెడ్మాస్టర్లకు పదోన్నతులు కల్పించాలని గెజిటెడ్ హెడ్మాస్టర్ ఆస్పిరెంట్ ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ నజీముద్దీన్, ప్రధాన కార్యదర్శి యశ్వంత్ రావు విజ్ఞప్తి చేశారు. మల్టీజ్ జోన్ వన్, మల్టీ జోన్ 2 హైదరాబాద్ తో కలిసి సుమారు 850 హెడ్మాస్టర్ పోస్టులు, 640 ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పాఠశాలలకు హెడ్మాస్టర్ లేకపోవడంతో సబ్జెక్టు టీచర్ ఇంచార్జి హెడ్మాస్టర్ గా బాధ్యతలు నిర్వహించడంతో విద్యార్థులకు సబ్జెక్టు, అడ్మినిస్ట్రేషన్ పరంగా పూర్తిగా న్యాయం చేయలేని పరిస్థితి ఉందన్నారు. 2024 లో గెస్ట్ హెడ్మాస్టర్ పదోన్నతుల ప్రక్రియ వెబ్ ఆప్షన్ వరకు వచ్చిన ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 24 సంవత్సరాలుగా ఒకే క్యాడర్లో పనిచేస్తున్న మాకు పదోన్నతులు కల్పించాలని కోరారు. గత ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఫోకస్ పెట్టి ప్రమోషన్లు కల్పిస్తే పాఠశాల నిర్వాహన ఇంకా మెరుగ్గా ఉంటుందని సోమవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో వారు తెలిపారు.



## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సెక్రటేరియట్ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): సెక్రటేరియట్ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సచివాలయం లో మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ పదవుల ఎన్నికలలో బీసీ వర్గానికి చెందిన అభ్యర్థులు గెలిచిన సంఖ్య, క్లాస్ IV ఉద్యోగుల సంఘం ఎన్నికలలో బీసీ అభ్యర్థులు సంఖ్య గణనీయంగా అత్యధిక స్థానాల్లో విజయం విషయాన్ని మంత్రికి వివరించారు. ఇది సచివాలయంలో బీసీ ఉద్యోగుల ప్రాబల్యాన్ని ప్రతిబింబిస్తోందని, వారు అన్ని వర్గాలతో కలసికట్టుగా పనిచేస్తున్న దృక్పథాన్ని చాటుతోందని మంత్రి తో పంచుకున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను మంజూరు చేయడం పట్ల సంఘం తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు తోడ్పడే గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అసోసియేషన్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ, ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత ఐక్యతతో, నిబద్ధతతో ముందుకు సాగాలని, ప్రభుత్వ విధానాల అమలులో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ అసోసియేషన్ అధ్యక్షులు టి. యాదగిరి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్, సచివాలయ ప్రధాన సంఘం ఖజాంచి వి. కైలాసం, ఉపాధ్యక్షుడు ఎం. నవీన్ కుమార్ తో పాటు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# చదువుతోపాటు క్రమశిక్షణ అత్యంత కీలకం

**నేటి తరం యువత డ్రగ్స్ కి బానిస కావద్దు..**

**ప్రభుత్వ, పరిశ్రమల సహకారంతో ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తున్నాం..**

**పటాన్చెరు పట్టణంలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత ప్రభుత్వ విద్య..**

**జులై 15 నుండి పాలిటెక్నిక్ కళాశాల తరగతులు..**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 4 కోట్ల రూపాయలతో నిర్మించిన అదనపు తరగతుల ప్రారంభోత్సవం**



పటాన్చెరు : ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రమశిక్షణ నేర్చుకోవడం అత్యంత కీలకమని.. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే క్రమశిక్షణ బాటలు వేస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరులో విద్యార్థుల సౌకర్యం కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జులై 15 నుండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు నియోజకవర్గంలోని పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులతో ప్రభుత్వ విద్యాసంస్థల భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు.


పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాలలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో నాలుగు కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో నిర్మించిన 15 అదనపు తరగతి గదులను సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. భవనాలతోపాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకం మమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కళాశాలల ఉపాధ్యాయ బృందాలు విద్యార్థులను తమ సొంత బిడ్డల వలె విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్లాలని కోరారు.

ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ కి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని కోరారు.. మత్తు పదార్థాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే కళాశాల ఉపాధ్యాయ బృందానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వం ఇటీవల పటాన్చెరు నియోజకవర్గానికి మంజూరు చేసిన పాలిటెక్నిక్ కళాశాల కౌన్సిలింగ్ ప్రారంభమైందని.. జూలై 15వ తేదీ నుండి పటాన్చెరు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. అతి త్వరలో పాలిటెక్ని కళాశాలకు సైతం భూమి కేటాయించి శాశ్వత భవనం నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో విద్యాసంస్థల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న గ్లాండ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, గ్రాండ్ ఫార్మ పరిశ్రమ సిఎస్ఆర్ హెడ్ రఘురామన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, అశోక్, అఫ్జల్, వెంకటేష్, కళాశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోతే రాష్ట్రం వ్యాప్తంగా ఉద్యమిస్తాం

**జూలై రెండో వారంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహాధర్నా**

**బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్....**



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని, రాష్ట్రము అగ్నిగుండం అవుతుందని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ దగ్గర అఖిలభారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయినబోయిన రమేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన యాదవుల సత్యాగ్ర దీక్ష ముఖ్య అతిథిగా రాజారాం యాదవ్ హాజరై మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల పాలన, కుటుంబ పాలన, రెడ్డి పాలన చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఢిల్లీ వేదికగా ఎండగడతామని హెచ్చరించారు. జూలై రెండవ వారంలో ఢిల్లీ జంతర్మంతర్ దగ్గర యాదవుల మహా ధర్నా ఉంటుందని రాజారామ్ యాదవ్ ప్రకటించారు. కామరెడ్డి బిసి డిక్లరేషన్ లో భాగంగా బీసీలకు ముఖ్యంగా యాదవులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 42% బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో యాదవులకు మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ చైర్మన్లు గా అనేక అవకాశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. యాదవుల తో పాటు గతంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన మున్నూరు కాపు సామాజిక వర్గంతోపాటు ఎంబీసీలకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించాలని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి లబ్ధిదారుల ఖాతాల్లో రెండు లక్షల రూపాయలు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయంగా తమకు రావలసిన వాటా ఇవ్వకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి యాదవులు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. యాదవ హక్కుల పోరాట జాతీయ అధ్యక్షుడు మేకల రాముల యాదవ్ మాట్లాడుతూ. సంఘాలు అన్ని ఐక్యమై కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదవులను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, అటవీ శాఖ మాజీ కార్పొరేషన్ చైర్మన్ అరిగెల నాగేశ్వరరావు, గొర్ల పెంపకం దార్ల సహకార సంఘం మాజీ చైర్మన్ సోమనబోయిన సుధాకర్ యాదవ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ హైదరాబాద్ అధ్యక్షుడు మైకోల్ మహేందర్ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్, బుడిగ శ్రీనివాస్ యాదవ్, ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు,వివిధ పార్టీల సంఘాల నాయకులు హాజరయ్యారు.



## ఆశ్రిత గ్రూప్ నుండి ఏరో విల్లాస్ మోడల్ విల్లా ప్రారంభం
## విలాసవంతమైన జీవనానికి సరికొత్త ప్రమాణాలు

ఆశ్రిత గ్రూప్ ఇవాళ తమ కొత్త ప్రాజెక్ట్‌లోని ఏరో విల్లాస్ అనే మోడల్ విల్లాను శంషాబాద్‌లోని సతంరాయి కాలనీలో ప్రారంభించింది. హైదరాబాద్‌లో బ్రహ్మాండమైన విలాసవంతమైన గృహాలను నిర్మించాలనే కంపెనీ కలను నిజం చేసే దిశగా ఇది కీలక ముందడుగు.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటుడు, రచయిత, కవి, దర్శకుడు తనికెళ్ల భరణి హాజరయ్యారు. ఆశ్రిత గ్రూప్ ఎండీ సత్యమూర్తి, డైరెక్టర్ శౌక్తిక్ సలహాదారు పురుషోత్తం రెడ్డి ఆర్కిటెక్ట్ మేఘన కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా, ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో ఏరో విల్లాస్ ఉంది. ఇది ఒక గేటెడ్ కమ్యూనిటీ. ఇక్కడ ప్రతి విల్లాను చాలా జాగ్రత్తగా, అందంగా డిజైన్ చేశారు. ఆధునికతతో పాటు హాయిదనం ఉండేలా వీటిని నిర్మించారు. ఇప్పుడు ప్రారంభించిన మోడల్ విల్లాను చూస్తే, భవిష్యత్తులో ఇక్కడ నివసించే వారికి ఎలాంటి విలాసవంతమైన జీవితం లభిస్తుందో తెలుస్తుంది.

## యువకుడు అదృశ్యం మిస్సింగ్ కేసు నమోదు



వాయిస్ టుడే న్యూస్, జూన్ 30 మేడిపల్లి : మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంజనేయ నగర్, బోడుప్పల్ లో నివసించే బండారు వసంతరావు కన్స్ట్రక్షన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనతో పాటు అతని అల్లుడు అయినా వల్లెపు గోపీచంద్ వృత్తి ఇంటీరియర్ డిజైనర్, వయసు 22 సంవత్సరాలు అతని వద్దే ఉంటున్నాడు, ఇటీవల కాలంలో అతని అల్లుడైన గోపీచంద్ ప్రేమ విషయంలో మనస్తపం చెంది తేదీ 28.06.2025 నాడు మధ్యాహ్నం 12:30 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గోపీచంద్ తిరిగి ఇంటికి రాలేదు. కాగా అతనికి ఫోన్ చేయగా ఫోన్ స్విచాఫ్ వస్తుంది, ఇట్టి విషయంపై ఫిర్యాదుదారుడు బండారు వసంతరావు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదు పై మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇట్టి వ్యక్తిపై ఎవరికైనా ఏమైనా సమాచారం ఉంటే మేడిపల్లి పోలీసులు కు సమాచారం ఇవ్వగలరని సీఐ గోవింద రెడ్డి తెలిపారు.

# ఆధునిక సాంకేతికలో టీజీఎస్ఆర్టీసీ ముందడుగు

**ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టంతో ప్రజలకు మెరుగైన సేవలు...**

**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్...**



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలతో ఆర్టీసీ ముందుకువెళ్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో అమలు చేస్తోన్న ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)తో ఆర్టీసీ సిబ్బంది వేగంగా సేవలందిస్తున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం ముషీరాబాద్ డిపోను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఏఎఫ్‌సీఎస్‌లో భాగంగా ఐటిమ్స్, డిజిటల్ పేమెంట్స్ అమలు తీరును స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఈ వ్యవస్థ ఎంత సులభతరంగా ఉందో కండక్టర్లు ఆయనకు వివరించారు.

హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్సుల్లో ఏఎఫ్‌సీఎస్ అమలు చేస్తోన్న తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా ఏఎఫ్‌సీఎస్‌ను తమ బస్సుల్లో ఆర్టీసీ అమలు చేస్తోందనీ, ప్రతి రోజు సగటున 20 శాతం మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. త్వరలోనే అన్ని బస్సుల్లోనూ ఈ వ్యవస్థను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకువస్తుందని చెప్పారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా టీజీఎస్ఆర్టీసీలో ఆధునిక సంస్కరణలను ప్రవేశపెడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి-మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఆర్టీసీకి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోందన్నారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 191 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసిందని, తద్వారా రూ.6300 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు.

త్వరలోనే ఔటర్ రింగ్ రోడ్డు లోపల మొత్తం ఎలక్ట్రిక్ బస్సులను నడిపేలా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అలాగే, కొత్త కాలనీలకు ప్రజా రవాణా సేవలను విస్తరింపజేస్తామని, అందుకు ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఏఎఫ్‌సీఎస్‌లో భాగంగా ప్రస్తుతం క్యూఆర్ కోడ్ టికెటింగ్ అందుబాటులో ఉందని, త్వరలోనే వాట్సాప్ టికెటింగ్, డిజిటల్ బస్ పాస్‌ల సదుపాయాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. వాట్సాప్ యాప్‌లో ప్రయాణ వివరాలను నమోదు చేసి సులువుగా టికెట్లు పొందవచ్చని వివరించారు. ఆర్టీసీ యాప్‌లో డిజిటల్ బస్ పాస్‌లను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాట్సాప్, డిజిటల్ బస్ పాస్‌లను కండక్టర్ల వద్ద ఉండే ఐటిమ్స్‌తో స్కాన్ చేసి.. రాకపోకలు సాగించవచ్చని పేర్కొన్నారు.

**పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం....**



అనంతరం ముషీరాబాద్ డిపో ప్రాంగణంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ పాల్గొన్నారు. ముషాబాద్ డిపోకు చెందిన ఏడుగురు డ్రైవర్ కండక్టర్లు హెడ్ ఆఫీస్ కి చెందిన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా 29 సంవత్సరాలుగా డ్రైవర్ విధులు నిర్వహిస్తున్న నరేందర్, హెల్పర్ యాదగిరి లను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, సీఈఐటీ శ్రీదేవి, హైదరాబాద్ ఆర్ఎం సుధా పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలి

**కోలా జనార్దన్ గౌడ్...**


సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిది): దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సోషల్ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ కోలా జనార్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ లో జరిగిన జెఎసి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంతో పాటు తెలంగాణ లో నిరుద్యోగ సమస్య తీవ్రమైన సమస్యగా మారిందని ఈ సమస్య పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ 2014 ఎన్నికల సందర్భంగా దేశంలో 30 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారని అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తూ నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తామని చెప్పి ఎన్నికల్లోకి వచ్చిన బిజెపి.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో పెట్టుబడి దారులకు దోచిపెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకొని ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేసి ప్రజలకు న్యాయమైన సేవలను అందిస్తూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా ఉద్యోగ వ్యాపార పారిశ్రామిక రంగాలు ఎదగడానికి కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని దీనిలో భాగంగా జులై మూడో వారంలో ఢిల్లీ కేంద్రంగా పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం నేషనల్ అన్ ఎంప్లాయిస్స్ జేఏసీ చైర్మన్ గా జక్కుల వంశీకృష్ణ ను నియమించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, అంబాల నారాయణ, గోపి, కృష్ణ గౌడ్, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణచందర్ ద్వారానే స్వేచ్ఛ పరిచయం

**స్వేచ్ఛ కూతురు ఆరోపణలు అసత్యం....**

**వీడియో విడుదల చేసిన పూర్ణచందర్ భార్య స్వప్న...**



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిది): టీవీ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్ ను చిక్కడపల్లి పోలీసుల అరెస్టు చేసి చంచల్ గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే, అయితే పూర్ణచందర్ భార్య స్వప్న సోమవారం ఒక వీడియో రిలీజ్ చేశారు. స్వేచ్ఛ విషయంలో నా భర్త అమాయకుడు నిర్దోషి అని పేర్కొంది. పూర్ణచందర్ ద్వారానే స్వేచ్ఛ పరిచయం అయిందని వారి మధ్య సంబంధం ఉందన్న విషయం నాకు తెలియదని వారిద్దరి వ్యవహారం తెలిసాక పూర్ణచందర్ ను వదిలేసానని చెప్పింది. పూర్ణచందర్ పై స్వేచ్ఛ కూతురు చేసిన ఆరోపణలు అసత్యమని సొంత కూతుర్ల చూసుకున్నాడని తెలిపింది. పూర్ణచందర్ను అడ్డం పెట్టుకొని స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసి పూర్ణచందర్ ను బ్లాక్మెయిల్ చేసిందని చెప్పింది. నా పిల్లలను సైతం అమ్మ అని పిలవాలని స్వేచ్ఛ భయపెట్టిందని తెలిపింది.

**కస్టడీ కోసం పిటిషన్ వేసిన చిక్కడపల్లి పోలీసులు...**

స్వేచ్ఛ ఆత్మహత్యకు కారణమైన పూర్ణచందర్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు మరింత విచారణ కోసం సోమవారం కస్టడీ కోరుతూ చిక్కడపల్లి పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. సంతోష్ రావు అండతో ఎదిగిన పూర్ణచందర్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి ఖానాపూర్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారని తెలిసింది. అంతేకాదు స్వేచ్ఛ పూర్ణచందర్ రిలేషన్షిప్ లో ఉన్నారని సంతోష్ రావుకు ముందే తెలుసని, దీనిలో భాగంగానే గొడవలు జరుగుతున్నప్పుడల్లా స్వేచ్ఛతో నన్నేం చేయలేవు. రాజకీయంగా ఎక్కడో ఉన్న తాకలేవు చేయలేవంటూ స్వేచ్ఛను బెదిరించినట్టు తెలిసింది.



## మహిళా పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత శాఖమూరి సుగుణమ్మ

**ఐద్వా, ఎన్ఎఫ్ డబ్ల్యూ....**

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): మహిళా పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా ఉద్యమ నేత శాఖమూరి సుగుణమ్మ అని ఐద్వా, ఎన్ ఎఫ్ డబ్ల్యూ సంఘాలు కొనియాడారు. సోమవారం సుందర విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లి లక్ష్మి ప్రధాన కార్యదర్శి ఎన్ జ్యోతి అధ్యక్షతన శాఖమూరి సుగుణమ్మ సంస్మరణ సభ ను రెండు మహిళా సంఘాలు (ఐద్వా, ఎన్ ఎఫ్ డబ్ల్యూ) కలిసి ఘనంగా నిర్వహించాయి. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షురాలు రజిని, హైద్రాబాద్ జాతీయ సహాయ కార్యదర్శి మల్లు లక్ష్మి, బిఎస్ఎన్ మూర్తి, జర్నలిస్ట్ జమున, విమలక్క లు పాల్గొని మాట్లాడారు. సుగుణమ్మ ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ జీవితం చివరి వరకు సమాజానికి అంకిత భావంతో పని చేశారని, సుందరయ్య ఇచ్చిన పిలుపులో బాగా తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఎనిమిదేళ్ల వయసులోనే సాయుధ పోరాటంలో కొరియర్గా పనిచేసిన ధీర వనిత సుగుణమ్మ అని, ఆ పోరాటంలో అనేక ఆటంకాలు ఎదురైనా, ఎదుర్కొని నిలిచిన దేశాలే అని, పోరాటం విరమణ అనంతరం సారా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, పేదలకు గృహాలు మంచినీటి వసతుల కై పోరాటం చేసి సాధించిన దీశాలి అని కొనియాడారు. తమ సమాజం కోసం మహిళలు పోరాడాలని సుగుణమ్మ చెబుతుండేదన్నారు. ఆమె స్ఫూర్తితో అందరం పనిచేయటమే ఆమె కు అర్పించే నివాళులన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు ఇందిరా, సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు నర్సింగరావు, శోభ, టీ జ్యోతి, పసుపులేటి రమ, ఛాయాదేవి, పవన్, జీవన్, కల్పన, పాశం యాదగిరి, సంయుక్త, కే.ఆశాలత, బుగ్గ వీటి సరళ, నాగలక్ష్మి, శశికళ, మమత, తదితరులు పాల్గొన్నారు.






## ఫీజులు కట్టించుకోకుండా కేవలం ప్రాసెసింగ్ ఫీజుతోనే విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలి: ఏబీవీపీ

### తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి ముందు ఎబివిపి ధర్నా

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): సంవత్సర కాల ఫీజు కట్టించుకోకుండా కేవలం ప్రాసెసింగ్ ఫీజు తోనే విద్యార్థులకు కళాశాలలో అడ్మిషన్లు ఇవ్వాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. సోమవారం రోజు ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి ముందు విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ మాట్లాడుతూ. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ పొందిన మొదటి సంవత్సర విద్యార్థులకి సంబంధించిన ట్యూషన్ ఫీజు మొత్తం చెల్లిస్తేనే అడ్మిషన్ ఇస్తామనటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఫీజు రియంబర్స్మెంట్ కీ అర్హులైన విద్యార్థుల దగ్గర నుండి కూడా మొత్తం ఫీజులు వసూలు చేయడం సిగ్గు చేటన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తుందని ఆరోపించారు. ఇటీవలే తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ కి ఎబివిపి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన ఇప్పటి వరకు స్పందించకపోవడం శోచనీయమనీ, ఉన్నత విద్య మండలి ఛైర్మెన్ బయటికి వచ్చి మీడియా ముఖంగా డిగ్రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఎవరు కూడా ఫీజులు కట్టాల్సిన అవసరం లేదని చెప్పాలని పట్టుబట్టారు. విద్యార్థుల దగ్గర ఎటువంటి ఫీజులు కట్టించుకోకుండా కేవలం ప్రాసెసింగ్ ఫీజు తో అడ్మిషన్ ఇవ్వాలని, వెంటనే నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రిపోర్టింగ్ గడువును పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉన్నత విద్య మండలి అధికారులు మాట్లాడుతూ డిగ్రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఫీజులు కట్టాల్సిన అవసరం లేదని ఉన్నత విద్య మండలి నుండి ప్రెస్ నోట్ విడుదల చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరి ప్రసాద్,జిల్లా కన్వీనర్లు విక్రమాదిత్య, ఉదయ్ ,సాయి తేజ, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు దృహన్, సెక్రటరీ శివ శంకర్, కృష్, పులి రేవంత్, అంజన్, చరణ్ ,సురేందర్, సుప్రజ్, కిషోర్, మనిదీప్, సుశాంత్, సాయి, సాయి బాబా, బాల వర్ధన్ సుజయ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు



## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు

### తార్నాకలోని ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తల సంబరాలు....

### రాంచందర్ రావుకు ఘనంగా సన్మానం.....

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు పేరును బీజేపీ అధిష్టానం ఖరారు చేసిన నేపథ్యంలో సోమవారం తార్నాకలోని ఎన్ రాంచందర్ రావు నివాసానికి భారీగా చేరుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు.. ఈ సందర్భంగా రాంచందర్ రావుకు శాలువాలను కప్పి, పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర లు ఇంటి ఆవరణలో పెద్ద ఎత్తువ బాణ పంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నామినేషన్ వేసేందుకు తన నివాసం నుంచి బయలుదేరిన రాంచందర్ రావు మార్గమధ్యంలో ఓయూ లోని శివాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుండి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ బీజేపీ అధిష్టానం తన మీద ఉన్న నమ్మకంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా అవకాశం ఇచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని, పార్టీ అధిష్టానం తనకు అప్పజెప్పిన ఈ భాధ్యతను తెలంగాణలోని బీజేపీ నాయకులను,



కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపే చూస్తున్నారని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను నమ్మడం లేదని, వచ్చె స్థానిక సంస్థల, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బిజేపీ సత్తా చాటడమే కాకుండా, తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని రఘుపతి గౌడ్, జి, రవీందర్ రెడ్డి, వంగాల మధుమోహన్ రెడ్డి, అల్కపురి సురేష్ కట్టా భాస్కర్ రావు, రమేష్ నాయక్, కరుణాకర్ రెడ్డి, లక్ష్మణ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.





# అరుణ్ కుమార్ జైన్‌కు ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు పలికిన దక్షిణ మధ్య రైల్వే

సికింద్రాబాద్ జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పదవీ విరమణ సందర్భంగా ఆయనకు దక్షిణ మధ్య రైల్వే బృందం హృదయపూర్వక వీడ్కోలు పలికింది. అరుణ్ కుమార్ జైన్ 2022లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దక్షిణ మధ్య రైల్వేలో ఎక్కువ కాలం పనిచేసిన జనరల్ మేనేజర్‌గా గుర్తింపు పొందారు. ఆయన చురుకైన నాయకత్వం మరియు మార్గదర్శకత్వంలో, దక్షిణ మధ్య రైల్వే అపూర్వమైన వృద్ధి, పరివర్తన యుగాన్ని చూసింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలోని సమన్వయ హాల్‌లో జనరల్ మేనేజర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనను జ్ఞాపిక, శాలువా, పూల దండలతో ఘనంగా సత్కరించారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్ర వాల్, దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జె. వినయన్, ఇతర సీనియర్ అధికారులు గత మూడు సంవత్సరాలుగా జనరల్ మేనేజర్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. ఆయన ప్రశాంతమైన ప్రవర్తన, అపారమైన జ్ఞానం, విధి పట్ల నిబద్ధతను వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, దక్షిణ మధ్య రైల్వే అనేక గొప్ప విజయాలు సాధించడానికి వీలు కల్పించిన వారి అవిశ్రాంత కృషి, విధి పట్ల అంకితభావానికి బృందాన్ని ప్రశంసించారు.

సోమవారం తెల్లవారుజామున, దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం (ఆర్.పి.ఎఫ్ ) హైదరాబాద్‌లోని మౌలా అలీలోని



ఆర్.పి.ఎఫ్ శిక్షణ కేంద్రంలో జనరల్ మేనేజర్ విలువైన మద్దతు, డైనమిక్ నాయకత్వం మార్గదర్శ కత్వానికి గౌరవం, కృతజ్ఞతా చిహ్నంగా ప్రత్యేక ఉత్సవ వీడ్కోలు పరేడ్‌ను నిర్వహించింది. సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర సీనియర్ అధికారులు, జోన్ వ్యాప్తంగానున్న ఆర్.పి.ఎఫ్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కవాతు తర్వాత ఆర్.పి.ఎఫ్ సిబ్బంది కమాండో నైపుణ్యాలు, చురుకుదనం, సమన్వయం, దేశభక్తిని ప్రదర్శించే విభిన్న ప్రదర్శనలు జరిగాయి. మహిళా కమాండోల ప్రదర్శన, రెండు దేశభక్తి మరియు భక్తి నృత్య నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభను ఉద్దేశించి ప్రసంగించిన అరోమా సింగ్ ఠాకూర్, జనరల్ మేనేజర్ దార్శనిక నాయకత్వం, కరుణా స్వభావాన్ని ఆర్.పి.ఎఫ్ కు అవిశ్రాంత మద్దతును ప్రశంసించారు.

తన వీడ్కోలు ప్రసంగంలో అరుణ్ కుమార్ జైన్ ప్రయాణీకులను రక్షించడంలో, జాతీయ భద్రతను కాపాడడంలో ఆర్.పి.ఎఫ్ యొక్క అసాధారణమైన పనితీరుపై ప్రశంసలు వ్యక్తం చేశారు. పోలీసింగ్ విధులతో పాటు, ఆపదలో ఉన్న పిల్లలను రక్షించడంలో ఆర్.పి.ఎఫ్ యొక్క మానవీయ దృక్పథాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. మౌలా అలీలోని ఆర్‌పిఎఫ్ శిక్షణా కేంద్రం సైబర్ నేరాల దర్యాప్తు కేంద్రంగా గుర్తింపు పొందడం పట్ల అరుణ్ కుమార్ జైన్ గర్వాన్ని వ్యక్తం చేశారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది వారి అచంచల అంకితభావం మరియు వృత్తిపరమైన నైపుణ్యానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు ఆయన చేసిన కృషికి మరియు దక్షిణ మధ్య రైల్వేపై శాశ్వత ప్రభావాన్ని చూపినందుకు గౌరవ కృతజ్ఞతతో వీడ్కోలు పలికేందుకు సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శాంతియుత దీక్షకు బీసీ సంక్షేమ సంఘం సంఘీభావం



వరంగల్ / నర్సంపేట (వాయిస్ టుడే )జూన్ 30: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన శాంతియుత దీక్ష శిబిరన్ని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ సందర్శించి తెలంగాణ ఉద్యమకారులకు తన సంఘీభావం తెలిపారు. దీక్షను ఉద్దేశించి డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం నిరంతరం అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారులకు అప్పటి తొలి తెలంగాణ టిఆర్ఎస్ ప్రభుత్వము కేసీఆర్ రెండు సార్లు ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల నిర్బంధం, రైల్ రోకోలు, సకల జనుల సమ్మెలు చేసిన ఉద్యమకారులకు పట్టించుకోక ఎటువంటి న్యాయం చేయలేదని అన్నారు. 2023 సంవత్సరంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఎన్నికల మానిఫెస్టో లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, 25 వేల పెన్షన్, ఫ్రీగా రైల్వే, బస్సు పాస్ లతోపాటు ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోక పోతే తెలంగాణ రాష్ట్రంలో అందరిని కలుపుకొని ఉద్యమించడం జరుగుతుందని ప్రభుత్వాన్ని డ్యాగల శ్రీనివాస్ హెచ్చరించారు. దీక్ష అనంతరం దీక్షలో పాల్గొన్న ఉద్యమ నాయకులను డ్యాగల శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ ఉపాధ్యక్షులు బేతి విశ్వబంధు (భాస్కర్), మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, యువజన సంఘం కార్యదర్శి గోపగాని నాగరాజు గౌడ్, బీసీ సంఘం నాయకులు నూనె రంజిత్ ముదిరాజ్, మారపాక రమేష్ ముదిరాజ్, శీరంశెట్టి రాజేందర్ లతో పాటు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సేవాతరుణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వస్తువుల పంపిణీ

తొర్రూరు, జూన్ 30 వాయిస్ టుడే : లైన్స్ క్లబ్ ఆఫ్ సేవాతరణి ఆధ్వర్యంలో అధ్యక్షురాలు మాధవ పెద్ది వాణి అధ్యక్షతన 2024-2025 లయనిస్టిక్ చివరి రోజు సందర్భంగా సోమవారం 3 కార్యక్రమాలు చేపట్టారు.ఇందులో భాగంగా తొర్రూరు పట్టణంలోని స్నేహ నివాస్ ఆశ్రమంలో విద్యార్థినీలకు సానిటరీ ప్యాడ్స్, బొమ్మకల్ ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.10 వేల రూపాయల విలువచేసే షూస్,కిస్టు తండా ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు టై,బెల్టులను అందజేశారు. సిడబ్ల్యూసి చైర్ పర్సన్ డిసి డాక్టర్ ఎస్. నాగవాణి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సేవా తరుణి ఆధ్వర్యంలో చేయూత అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తిరుపతి రెడ్డి ,ఉపాధ్యాయులు అనుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి ,వేణుమాధవ్, రాధిక, స్నేహ నివాస్ ఆశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.





## జమీందారీ సురేఖకు అమ్మ భరోసా కిట్ పంపిణీ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి ( వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా లో ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు జమీందారీ సురేఖకు అమ్మ భరోసా కిట్ పంపిణీ చేశారు. సోమవారంరోజు కొలనుపాక లో గల గర్భిణీ స్త్రీ అయిన సురేఖ తో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమయానికి భోజనం చేస్తున్నావా? మందులు వేసుకుంటున్నారా? అంటూ అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలని, సమయానికి ఆహారం తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని తెలిపారు. వారి కుటుంబ పరిస్థితులని అడిగి తెలుసుకున్నరు.ఈ సమయంలో మానసిక ఒత్తిడులకు గురి కాకుండా ఉండాలని సూచించారు. అలాగే భవాని కుటుంబానికి అవసరమైన పోషకాహారాన్ని అందించేందుకు న్యూట్రిషన్ కిట్‌ను వారికీ అందజేశారు. అనంతరం, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం చేసుకోవడం పూర్తి స్థాయిలో ఆరోగ్యకరమని మరియు పైసా ఖర్చులు లేకుండా ప్రసవించవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సమయంలో తల్లి, బిడ్డకు అవసరమైన మందులు, టీకాలు ఉచితంగా అందించబడతాయని తెలిపారు. ఇంకా, కాన్పు తర్వాత 102 వాహన సేవ ద్వారా తల్లిని బిడ్డతో కలిపి ఇంటి వద్ద దింపే సదుపాయం కూడా ఉందని వివరించారు. ఆహార పదార్థాలపై కూడా కలెక్టర్ గర్భిణి స్త్రీ కి అవగాహన కల్పించారు. మెంతికూర, తోటకూర, గోంగూర వంటి ఆకుకూరలను పప్పుతో కలిపి వారానికి కనీసం రెండు సార్లు తినాలని చెప్పారు. అలాగే గ్లాస్ పాలు, కొబ్బరి ముక్కలు (ఎండినవి లేదా తాజా), పల్లీలు బెల్లంతో కలిపి, ఖర్జూరాలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నప్పుడు డాక్టర్ సూచన మేరకు ఐరన్ ట్యాబ్లెట్స్ లేదా ఇంజక్షన్ రూపంలో తీసుకోవాలని సూచించారు.ఇలాంటి రకమైన ఆహారం ద్వారా గర్భిణికి స్త్రీ లు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందని. అలాగే కాన్పు అయిన తర్వాత ఒక గంటలోపు ముర్రు పాలను తప్పకుండా ఇవ్వాలనే అంశంపై కూడా గర్భిణికి అవగాహన కల్పించారు. ప్రతి నెలలో ఒక రోజు "అమ్మకు భరోసా" కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకి సూచించారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందడంతో పాటు తల్లి బిడ్డల ఆరోగ్యం పదిలంగా తెలియచేసారు. అదేవిదంగా అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తరచూ గర్భిణుల ఇండ్లను సందర్శించి గర్భిణి స్త్రీల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని వారికీ తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సంక్షోభంలోను సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం

**ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గౌరవిస్తున్నాం**

**ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు.. సంక్షేమ పథకాలను చేరని గడప లేదు**

**ప్రతి పేద కుటుంబానికి ఆశ్రయంగా మారుతున్న ప్రజా ప్రభుత్వ సంకల్పం**

**760 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ**



హనుమకొండ, వాయిస్ టుడే: "గత పాలకుల భాద్యతాహీన పాలన వల్ల ఆర్థికంగా దెబ్బతిన్నా, సంక్షోభంలోను సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తడబడలేదని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆర్థిక సంక్షోభం, అస్థిరతల మధ్య కూడా సంక్షేమ పథకాలను నిలకడగా అమలు చేస్తున్న ప్రజా సంకల్పానికి నిదర్శనంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఒక కీలక ఘట్టాన్ని ఆవిష్కరించింది. వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ అంబేద్కర్ భవన్ లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని పాల్గొని 760 మంది అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర్ మేయర్ గుండు సుధారాణి, నగర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి పేద కుటుంబానికి మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇళ్లను కేటాయించగా, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కఠినమైనదై ఉన్నా ఇప్పటివరకు 2,000 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. మిగిలిన అర్హులు తమ వివరాలతో ప్రజాప్రతినిధులను లేదా సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, గతంలో ఎన్నో దఫాలుగా చేసిన ప్రయత్నాలు ఫలించినందుకు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు ద్వారా తమ కుటుంబానికి గౌరవభరితమైన జీవితం ప్రారంభమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, వేముల శ్రీనివాస్, మానస రాంప్రసాద్, విజయశ్రీ రజాలీ, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్ మరియు పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై కేంద్రంపై ఒత్తిడి తెద్దాం...

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తో సమావేశమైన దాస్యం**

కాజీపేట, వాయిస్ టుడే: కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నిర్మాణ పనుల్లో వేగం పెరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేలా పార్టీ పరంగా పోరాడాలని మాజీ ఛీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు సూచించారు. సోమవారం హైదరాబాద్ లో ఎంపీ వద్దిరాజు నివాసంలో వినయ్ భాస్కర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఓరుగల్లు ప్రజల 40 ఏళ్ల కలను సహకారం చేసేందుకు కృషి చేద్దామని అన్నారు. స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేద్దామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు దక్కాల్సిన విభజన చట్ట హామీల సాధనకై కలిసి ఉద్యమిద్దామని ఎంపీ ని కోరారు. కేంద్రీయ విద్యాసంస్థలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొల్పేలా బీజేపీ ప్రభుత్వంపై పోరాడుదాం అని సూచించారు. మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణం విషయమై కేంద్రం వేగంగా చర్యలు చేపట్టేలా ఒత్తిడి తెద్దామని.. ఇందుకోసం అవసరమైన కార్యాచరణకు సైతం సిద్ధమవుదామని చర్చించారు. ఈ సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామ ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎంపీ లాండ్స్ నిధులు కేటాయించాలని వినయ్ భాస్కర్ ఎంపీ వద్దిరాజు ను కోరారు.



## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంతోషం..

వాయిస్ టుడే, కాజీపేట: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంతోషం నిండుతుందని 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ లబ్దిదారులకు అందజేశారు. అనంతరం డివిజన్ లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు రాని వారు నిరాశపడొద్దని, ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇండ్లు అందజేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం లో పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ తెలియజేశారు.

## ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

**బీఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు ప్రజలను మోసం చేశారు**

**బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 7 లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతుంది: ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం సాయంత్రం రాయపర్తి మండలంలో 14 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 20 వేల మెగా టన్నుల సామర్థ్యం గల గోదాము పనులను రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి ల తో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఇల్లు ఇస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు 10 సంవత్సరాలు ప్రజలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని తెలియజేసారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం ఇలా ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 7 లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతూనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందని ఎంపీ కావ్య తెలియజేశారు. దాదాపు 20 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలియజేశారు. కాంగ్రెస్ పాలనలో వరంగల్ మహా నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్ మెగా టెక్స్ టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వెల్ నెస్ సెంటర్ ఇలా అన్ని రంగాల్లో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుకువెళ్లాలన్నారు. రాయపర్తి మండల అభివృద్ధికి తన ఎంపీ నిధులు కేటాయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టిపీసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, వివిధ సంఘాల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల కోర్టు ఏజిపిగా మేరుగు శ్రీనివాస్ నియామకం



హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: హన్మకొండ జిల్లా పరకాల ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజిపి )గా న్యాయవాది మెరుగు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ జస్టిస్ వ్యవహారాల కార్యదర్శి ఆర్. తిరుపతి శ్రీనివాస్ ను ఏజీపీ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. మేరుగు శ్రీనివాస్ గత 25 సంవత్సరాల నుండి న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్న శ్రీనివాస్ పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా కొనసాగి ఆ పదవులకు వన్నెతెచ్చాడు. ప్రముఖ సీనియర్ న్యాయవాది ఏరుకొండ జయశంకర్ వద్ద జూనియర్ న్యాయవాది గా పనిచేసి ఆ తర్వాత సొంతంగా సివిల్ క్రిమినల్ కేసులను వాదించి స్థానిక ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు న్యాయవాదులు, పురః ప్రముఖులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏజీపీ గా నియమితులైన శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియమాకానికి ప్రత్యేక చొరవ చూపిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. పరకాల న్యాయస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున తన వాదనలు వినిపించి ప్రజల ఆదరాభిమానాలు చూరగుంటానని శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎన్నికల కమిషన్ మంత్రి కొండ సురేఖ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**– బిజెపి రాష్ట్రనాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు**



వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 30 : వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి కొండ సురేఖ శాసనసభ సభ్యత్వాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ రద్దు చేయాలని బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు విజ్ఞప్తి చేశారు. వరంగల్ ఓసీటీ లోని క్యాంప కార్యాలయం నుండి ఈ మేరకు అయన సోమవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. 2023 తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఎన్నికల నియమాలకి విరుద్ధంగా రూ,, 70 కోట్లు ఖర్చు చేసి తన సతీమణి కొండా సురేఖను గెలిపించానని ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురలీధర్ రావు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని ఎన్నికల కమిషన్ కొండ సురేఖ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. ఆదివారం వరంగల్లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న కొండా మురళీధర్ రావు తన భార్య కొండా సురేఖ గారి గెలుపు కొరకు 16 ఎకరాలు భూమి అమ్మి 70 కోట్లు ఖర్చు చేశానని సమావేశంలో మాట్లాడిన విషయాన్ని అయన గుర్తు చేశారు. 2023 ఎన్నికల అఫిడవిట్లో తన పేరు మీద ఒక ఎకరం, తన భర్త కొండా మురళి పేరున 13.31 ఎకరాలు ఉన్నాయని వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ప్రస్తుత రాష్ట్ర మంత్రి కొండ సురేఖ పొందుపరిచారని, కొండా మురళి ఆదివారం వరంగల్ లో జరిగిన సమావేశంలో మాట్లాడినప్పుడు ప్రస్తుతం తనకు 500 ఎకరాల భూమి ఉందని 16 ఎకరాలమ్మి రూ. 70 కోట్లు ఖర్చు చేశానని చెప్పారని, కొండా మురళి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు సమర్పిస్తానని చెప్పారు. ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి సురేఖ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతామన్నారు అడ్డదారిలో వరంగల్ తూర్పు నుంచి గెలిచి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కొండ సురేఖ నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని అయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



## విశ్రాంతజీవితం సమాజసేవకు అంకితంచేయాలి

**జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్**

తొర్రూరు, జూన్ 30 వాయిస్ టుడే : ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని, విశ్రాంత జీవితం సమాజసేవకు అంకితం చేయాలని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ అన్నారు. తొర్రూరు రెండవ ఎస్సై రాంజీ నాయక్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్సై దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహచర పోలీస్ అధికారులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదవి విరమణ ఉద్యోగానికి మాత్రమేనని శేష జీవితం కుటుంబంతో గడిపేందుకు, సామాజిక సేవకు అంకితం చేయాలని కోరారు. రాంజీ నాయక్ అంకితభావం గల పోలీసు అధికారి అని, విధి నిర్వహణలో క్రమశిక్షణగా మెలిగి మంచి పేరు సాధించాడని కొనియాడారు. ఉద్యోగ ధర్మాన్ని మూడు దశాబ్దాలకు పైగా త్రికరణ శుద్ధితో నిర్వహించాడని గుర్తు చేశారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే పోలీస్ శాఖ కృషి ముఖ్యమని, అలాంటి పోలీసు విభాగంలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి శాఖకు పేరు తీసుకురావడంలో రాంజీ నాయక్ కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి శ్రీనివాస్, సైబర్ క్రైమ్ డిఎస్పి శ్రీనివాస్ , డిఎస్పి లు తిరుపతి, చంద్రమౌళి, ఎస్సై దీపికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి

**– తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) హనుమకొండ జిల్లా కమిటీ ఎన్నిక**

**పత్రికల ఎంప్యానల్ మెంట్ వెంటనే చేపట్టాలి**

**తెలంగాణ ప్రెస్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**

హనుమకొండ( వాయిస్ టుడే ) జూన్ 30: ప్రజాస్వామ్యంలో మూల స్తంభాలలో నాలుగవ స్తంభం లాంటి జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దాడులు పునరావృతం అవుతున్నాయని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా కమిటీ ఎన్నిక జిల్లా కేంద్రంలో జరిగినది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించే అమలు చేయడం వల్ల దాడులను నివారించవచ్చునని సూచించారు. ప్రభుత్వం ఎప్పటి కప్పుడు తాత్కాలికమైన నిర్ణయాలు తీసుకోకుండా జర్నలిస్టుల సంబంధిత అవసరాలను పరిగణలోకి తీసుకొని ఒక సమగ్రమైన మీడియా పాలసీని రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన తో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంలో కీలక పాత్ర పోషించిన పత్రికలు, చానల్స్ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు అదే విధంగా ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్థానిక పత్రికల ఎం ప్యానల్ ఎంపానెల్ మెంట్ వెంటనే చేపట్టి రుణభారంతో బ్రతుకులీడుస్తున్న పాత్రికేయులను ఆదుకోవాలని అన్నారు. ఇప్పుడు ఉన్న యూనియన్లు జర్నలిస్టుల సంక్షేమం కోసం కాకుండా తమ వ్యక్తి గత ప్రయోజనాలకే పరిమితమయ్యాయని ఆయన విమర్శించారు. అలా కాకుండా తాము ఒక ప్రత్యామ్నాయ జర్నలిస్టు ఉద్యమ నిర్మాణానికి శ్రీకారం చూట్టామని అన్నారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **హన్మకొండ జిల్లా కమిటీ :** జిల్లా అధ్యక్షుడిగా ముత్తొజు రాము, ప్రధాన కార్యదర్శిగా దొరి హరికృష్ణ , కోశాధికారిగా గణపనేని చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులుగా పబ్బు రాజ్ కుమార్, ఆర్.అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శులు దాడి బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మంద సదానందం, బెల్లంపల్లి చరణ్ ,ఈసీ మెంబర్లుగా గోక శ్రవణ్, పొన్నాల సురేష్ లు ఎన్నికయ్యారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
మంగళవారం, 1 జూలై 2025



## జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

**కలెక్టర్ కు వినతిపత్రం అందజేత..**

**టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా..**

వాయిస్ టుడే ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల జిల్లా: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో నూటికి నూరు శాతం ఫీజు రాయితీని కల్పించాలని (టియుడబ్ల్యూజే హెచ్ 143 ) తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా కోరారు. ఈ మేరకు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా మాట్లాడుతూ పాత్రికేయులు ఎటువంటి జీతభత్యాలు లేకుండా సమాజంలోని సమస్యలను అనునిత్యం చేరవేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్నారన్నారు,అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పేద,మధ్య తరగతి వర్గాల వారే ఎక్కువమంది జర్నలిస్టులు ఉన్నారని,ప్రైవేట్ విద్యాసంస్థల్లో వారి పిల్లలకు నూటికి నూరు శాతం ఫీజు రాయితీని జర్నలిస్టుల పిల్లలకు కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. అలాగే గతంలో కొందరు ప్రైవేటు విద్యాసంస్థల వారు డీఈవో ఉత్తర్వులను కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ఈసారి ఆ విధంగా కాకుండా ఖచ్చితంగా ప్రతి విద్యా సంస్థ వారు అమలు చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్, ఇన్చార్జి డిఈఓ వినోద్ కుమార్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టు పిల్లలకు నూటికి నూరు శాతం రాయితీని అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.




## ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్న నాలుగురు పై పిడి యాక్ట్ అమలు

వాయిస్ టుడే రాజన్న సిరిసిల్ల జిల్లా/వేములవాడ: నిందుతులకు పిడి యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి సోమవారం రోజున వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో చర్లపల్లి జైలుకి తరలించినట్లు జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు.

నిందుతుల వివరాలు.

1.బైరెడ్డి వినయ్ S/oరాజు, 28 సంవత్సరాలు, R/o కోనయ్యపల్లి, వేములవాడ.
2.ఈర్ల సాయి S/o మురళి, 24 సంవత్సరాలు, R/o ఉప్పుగడ్డ, వేములవాడ టౌన్.
3.వస్తాద్ అఖిల్ S/o శ్రీనివాస్, 22 సంవత్సరాలు, R/o ఉప్పుగడ్డ, వేములవాడ.
4.నేదూరి రాజేష్ S/o రాజనర్సు, 30 సంవత్సరాలు, వేములవాడ రూరల్ మండలం బాలరాజ్‌పల్లి (వి).

వేములవాడ పట్టణానికి చెందిన బైరెడ్డి వినయ్,ఈర్ల సాయి,వస్తాద్ అఖిల్,నేదూరి రాజేష్ అనే నాలుగు వ్యక్తులు గతంలో గంజాయి కేసులలో, హత్యాయత్నం కేసులలో,హత్య కేసులలో నిందుతులుగా ఉండి శిక్షలు అనుభవించినప్పటికి వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రానాప్పటికి తరచు నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా పై నాలుగురు నిందితులు వ్యవహరిస్తున్నందున నిందుతులపై జిల్లా కలెక్టర్ పి.డి యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ,జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ గారు బైరెడ్డి వినయ్,ఈర్ల సాయి,వస్తాద్ అఖిల్,నేదూరి రాజేష్ లకు పిడి యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి సోమవారం రోజున నిందుతులని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగింది. జిల్లాలో ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ ఈసందర్భంగా హెచ్చరించారు. జిల్లాలో ఉన్న రౌడి షీటర్స్ పై పాత కేసులలో ఉన్న నెరస్థులపై నిత్యం పోలీస్ నిఘా ఉంటుందని, గతంలో పలు కేసులల్లో నిందుతులగా ఉండి తరచు నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ అమలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## అన్న ఇంటిని తగలబెట్టిన తమ్ముడికి ఐదేళ్ల జైలు శిక్ష



వాయిస్ టుడే రాజన్న సిరిసిల్ల జిల్లా/వేములవాడ: తమ్ముడి చేతిలో తగలబడిన అన్న ఇంటి కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లక్ష్మణ చారి సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి తెలిపారు

వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన బాల నరసయ్య తన భార్యతో కలిసి నివాసం ఉండేవాడు. అతనికి తన తమ్ముడు మల్లయ్యతో భూవివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న మల్లయ్య, 2019 జూన్ 12న రాత్రి 11 గంటల సమయంలో నరసయ్య ఇంటికి నిప్పంటించాడు. ఈ ఘటనపై నరసయ్య తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్.ఐ శేఖర్ కేసు నమోదు చేసి మల్లయ్యను రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల లక్ష్మీ ప్రసాద్ వాదించగా కోర్టు మానిటరింగ్ ఎస్సై నాయుడు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్,కానిస్టేబుల్లు నవీన్, రాజేందర్ లు ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి తెలిపారు..


# చేతులు మట్టిలో....హృదయం భారత దేశంతో



ఖమ్మం ,జూన్ 30 ( వాయిస్ టుడే): చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ( సిఐఓ) దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేక పర్యావరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. దీని పేరు "చేతులు మట్టిలో –హృదయం భారతదేశంతో". ఈ ఉద్యమం కింద 2025 జూన్ 25 నుంచి జూలై 26 వరకు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది పిల్లలతో 10 లక్షల చెట్లు నాటించి వాటిని సంరక్షించడం సిఐఓ లక్ష్యంగా పెట్టుకుందని జమాఅతె ఇస్లామీ హింద్ ఖమం జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ అన్నారు . జమాఅతె ఇస్లామి హింద్ స్థానిక కార్యాలయంలో పిల్లలతో కలిసి ఉద్యమ లోగో మరియు పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇస్లామిక్ విలువల ఆధారంగా పిల్లల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకున్న జాతీయ సంస్థ అయిన సిఐఓ , ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత వంటి విలువలు బాల్యంలోనే అలవడాలి అని విశ్వసిస్తుంది. చెట్లు నాటడం ద్వారా పిల్లల్లో దేశభక్తి, పర్యావరణ భద్రత, సేవా భావం పెరుగుతాయని ఈ ఉద్యమం నమ్ముతుంది. ఈ ఉద్యమం వెనుక ఉన్న ఆలోచన స్పష్టంగా ఉంది %–% భూమి వేడెక్కుతోంది, వృక్షావృక్షాలు తగ్గిపోతున్నాయి, గాలి నాణ్యత దిగజారుతోంది. వనాలు మాయమవుతుండటం వలన వాతావరణ మార్పులకు మన రక్షణ తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో పిల్లలు మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించగలరని సిఐఓ నమ్ముతుంది. చెట్టు నాటినప్పుడు అది పిల్లలకు జీవితాంతం బాధ్యత, ప్రేమ, సహనతను నేర్పే ఒక గొప్ప పాఠమవుతుంది. ఈ ఉద్యమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పిల్లలు తమ పాఠశాలలు, మదర్సాలు, మసీదులు, పార్కులు మరియు ఇంటి ముందు చెట్లు నాటనున్నారు. ప్రతీ చిన్నారి తన చెట్టుకు ఒక పేరు పెట్టి, దానిని స్నేహితులాగా సంరక్షించేందుకు ప్రోత్సహించబడతాడు అన్నారు ఈ ఉద్యమానికి మద్దతుగా గ్రీన్ ప్లెడ్జ్, శుక్రవారం నాడు ప్రసంగం ద్వారా ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించును , కళా పోటీలు, కవితల పోటీలు, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. పిల్లలు తమ ప్రయత్నాలను వీడియోలు, రీల్స్ రూపంలో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తాము. ఈ ఉద్యమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి సిఐఓ ప్రభుత్వ విభాగాలతో కలిసి పని చేస్తోంది. ఆరోగ్యవంతమైన మొక్కల్ని ఉచితంగా అందించడం, నాటేందుకు స్థలాలు గుర్తించటం, మొక్కల రకాలు మరియు జంతు జీవంపై విద్యా వనరులు అందించడం, మొక్కల సంరక్షణకు అవసరమైన సహకారం ఇవ్వడం వంటి అంశాల్లో భాగస్వామ్యం చేసుకుంటోంది. పిల్లల ఉత్సాహాన్ని పెంచేందుకు, ఈ ఉద్యమంలో భాగంగా కొన్ని స్ఫూర్తిదాయక నినాదాలు ప్రకటించబడ్డాయని అన్నారు.

చెట్టు నాటండి – భూమిని రక్షించండి
– గర్వంగా జీవించండి!

చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అందరిని – విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు మరియు మతపరమైన నాయకులని ఈ ఉద్యమంలో పాల్గొని మీరు కూడా "ట్రీ హీరో" మరియు "గ్రీన్ చాంపియన్" గా మారండని విజ్ఞప్తి చేస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మీడియా సంస్థలు, విద్యా సంస్థలు, పౌరసంఘాలు మరియు పర్యావరణ కార్యకర్తలు ఈ ఉద్యమానికి తోడ్పాటు అందించాలని సిఐఓ కోరుతోంది. ఒక్కో చిన్నారి ఒక్క చెట్టు నాటినా %–% 10 లక్షల చెట్లు దేశాన్ని పచ్చగా మార్చగలవు. చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సిఐఓ) అనేది చిన్నారుల కోసం, చిన్నారుల ద్వారా, పెద్దల పర్యవేక్షణతో నడిచే జాతీయ స్థాయి సంస్థ. ఇది ఇస్లామిక్ విలువల ఆధారంగా పిల్లల్లో మంచి నైతికత, విద్యా శ్రేష్టత, సామాజిక చైతన్యం మరియు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామి హింద్ సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్ , నార్త్ అధ్యక్షురాలు హుస్నేన్ బి , ఈస్ట్ అధ్యక్షురాలు ఫైజా ఇరమ్ , సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా , సభ్యులు సమీనా కౌసర్, జహిరా , నస్రీన్ , నసీమున్నిసా , అబిదా సల్మా , అఫ్‌రోజ్, హాజిరా, నూరీ అఫ్ఘ ,షాజియా, సబిహే , ఫర్జానా, సీమా , ఫాతిమా, సీమ అతహర్, సల్మ అఫ్ రోజ్, నూర్జహన్, షభానా మరియు మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

### గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 27 ఫిర్యాదులు స్వీకరణ

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్..

వాయిస్ టుడే రాజన్న సిరిసిల్ల జిల్లా: ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్. తెలిపారు. సోమవారం రోజున నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 27 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## గొల్లపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ

వాయిస్ టుడే ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట/ రాజన్న సిరిసిల్ల జిల్లా: గొల్లపల్లి గ్రామ శివారు లో ఎల్లారెడ్డిపేట ఎస్సై కే.రాహుల్ రెడ్డి తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించినారు. ఇట్టి వాహన తనిఖీలో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి బండి నడిపిన వారిపై కేసు నమోదు అయినదని, మరియు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఎస్సై ఎల్లారెడ్డిపేట మండల ప్రజలకు తెలిపారు.

## విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శంకరయ్య క్రీడాకారుల గుండెల్లో సజీవంగా బ్రతికే ఉంటాడు

### – అంతర్జాతీయ క్రీడాకారులు ప్రభు.



జమ్మికుంట జూన్ 30 (వాయిస్ టుడే):విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శంకరయ్య కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గత వారం రోజుల క్రితం మరణించగా సోమవారం జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఘన నివాళులు అర్పించి, తన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ప్రభు , వై సరస్వతి మాట్లాడుతూ.. రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కొండపాక శంకరయ్య ఉద్యోగరీత్యా సుమారు 35 సంవత్సరాల పాటు పని చేసి ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన నిరుపేద బిడ్డలను కుల, మతాలకతీతంగా గొప్పగా ఎదగాలని, ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయి ఎదిగే విధంగా శిక్షణ ఇస్తూ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపి మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు.

ఆయన వ్యాయామ ఉపాధ్యాయుడే కాకుండా ప్రధానోపాధ్యాయులుగా వివిధ ప్రాంతాలలో విశేషమైన సేవలను అందించి ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులను క్రీడారంగంలో జాతీయ అంతర్జాతీయ పోటీలలో విజేతలుగా నిలిపిన ఘనత ఆయనదని పేర్కొన్నారు. చదువుతో పాటు, క్రమ శిక్షణ తో కూడిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారందరూ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలోకొండపాక కిషోర్ , వై సరస్వతి, వేల్పుల శేఖర్, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదే గుణసాగర్, మంద జగన్, భీష్మ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సి ఇ ఐ ఆర్ పోర్టల్ ను ప్రజలు వినియోగించుకోవాలి : పట్టణ సిఐ కరుణాకర్

హుజురాబాద్ జూన్ 30 (వాయిస్ టుడే): హుజురాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల తరచుగా మొబైల్ ఫోన్లు పోతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కరుణాకర్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందం ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో భాగమైన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ద్వారా నూతనంగా టెక్నాలజీని వినియోగించి, మొత్తం లక్ష రూపాయల విలువైన ఐదు మొబైల్ ఫోన్లను గుర్తించి సోమవారం తిరిగి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కి వచ్చిన బాధితులు తమ ఫోన్లు తిరిగి అందించినందుకు ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఫోన్లు పోయిన పక్షంలో బాధితులు తప్పనిసరిగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, %జజు×=% సాంకేతికతను ఉపయోగించి ఫోన్లు ట్రేస్ చేసి తిరిగి అందజేయవచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



## ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని అరికట్టాలి

### : బీజేవైఎం అధికార ప్రతినిధి గణేష్



జమ్మికుంట జూన్ 30 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయని కరీంనగర్ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి గణేష్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ విద్యను పూర్తిగా వ్యాపారంగా చేసి.. బుక్స్ యూనిఫార్మ్, ఇతర సామగ్రి తాము అనుకున్నట్టుగానే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. బుక్ స్టాల్స్ తో.. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు కుమ్మక్కయ్యాయని విమర్శించారు. ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల విషయంలో సైతం అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని వెల్లడించారు. ఈ విషయాలన్నింటిపై విద్యాశాఖ జిల్లా అధికారులకు తెలియజేసి, విద్యార్థులు తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులు పాలు చేయకుండా యాజమాన్యాలపై తగువిధంగా అధికారులు స్పందించాలని విన్నవించనున్నట్టు స్పష్టం చేశారు. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లాభార్జనే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరిట.. ముక్కు పిండి మరి డబ్బులు వసూలు చేస్తున్న "ప్రైవేట్" స్కూల్స్ యాజమాన్యాలకు కొమ్ముగాసే విధంగా అధికారుల తీరు ఉండకూడదని, అలా ఉన్న వారిపై జిల్లా స్థాయి ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యా శాఖను రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నప్పటికీ.. రాష్ట్రంలో ఆ మేరకు సదరు శాఖలో మార్పులు ఏవి కనిపించడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.